# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | శనివారం 18-9-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 45 | పేజీలు:4 | వెల: రూ.1/-


## సీఎం కేసీఆర్‌ను కలిసిన జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి



చేర్యాల, సెప్టెంబర్ 17:: జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి శుక్రవారం ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిశారు. చేర్యాల పట్టణంతోపాటు చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయాలని కోరారు.

# ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా జూట్: మంత్రి కేటీఆర్




హైదరాబాద్ , సెప్టెంబర్ 17: తెలంగాణ శరవేగంగా అభివృద్ధి చెందుతున్నదని మంత్రి కేటీఆర్ అన్నారు. వ్యవసాయ రంగంలో దేశానికే తెలంగాణ ఆదర్శమని చెప్పారు. రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తులు భారీగా పెరుగుతున్నాయని చెప్పారు. సీఎం కేసీఆర్ విజన్‌తో వ్యవసాయ దిగుబడులు ఐదింతలు పెరిగాయని వెల్లడించారు. రాష్ట్రంలో మూడు ఆధునిక జూట్ మిల్లుల ఏర్పాటుపై మంత్రులు కేటీఆర్, నిరంజన్‌రెడ్డి, గంగుల కమలాకర్ సమక్షంలో పరిశ్రమల శాఖ కార్యదర్శి జయేశ్ రంజన్ ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జూట్ మిల్లుల ఏర్పాటుతో 10 వేల 4 వందల మందికి ఉపాధి లభిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కోటి టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నదని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వానికి, వ్యవసాయానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా రైతులు ప్రత్యామ్నాయ పంటలవైపు దృష్టిపెట్టాలని సూచించారు.

అండగా ఉంటాం..

ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా పర్యావరణానికి జూట్ ఉత్పత్తులు ఉపయోగపడతాయని చెప్పారు. మన రాష్ట్రంలో ఇప్పటివరకు జూట్ మిల్లులు లేవన్నారు. జూట్ మిల్లులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. రాబోయే 20 ఏండ్లలో సివిల్ సప్లై కార్పొరేషన్ ద్వారా జూట్ ఉత్పత్తులు కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు. మొదటి విడతలో భాగంగా జూట్ ఉత్పత్తులను కొనుగోలు చేస్తామన్నారు.

10 వేల ఎకరాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ జోన్లు

తెలంగాణ రాష్ట్రం సీడ్ బౌల్ ఆఫ్ ఇండియాగా అవతరించిందని మంత్రి కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలో పదివేల ఎకరాల్లో స్పెషల్ ఫుడ్ ప్రాసెసింగ్ జోన్లు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. భవిష్యత్‌లో జూట్ పరిశ్రమకు రాష్ట్రంలో మంచి డిమాండ్ ఉంటుందని చెప్పారు.

నాణ్యతకు ప్రాధాన్యమివ్వాలి: మంత్రి నిరంజన్ రెడ్డి

సీఎం కేసీఆర్ ఇవాళ ఏం ఆలోచిస్తే రేపు దానిని దేశమంతా అనుసరిస్తుందని మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న మార్పుల నేపథ్యంలో నాణ్యతకు ప్రాధాన్యమివ్వాలని చెప్పారు. మిషన్ భగీరథ పథకాన్ని దేశంలోని చాలా రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకున్నాయన్నారు. వాతావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకే తెలంగాణకు హరితహారం కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. ఇది సీఎం కేసీఆర్ విజన్‌కు నిదర్శనమని చెప్పారు.

50 కోట్ల గన్నీ బ్యాగులు అవసరం: మంత్రి గంగుల

ప్రతి సంవత్సరం రాష్ట్రానికి 50 కోట్ల గన్నీ బ్యాగులు అవసరమవుతాయని మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. జూట్ మిల్లుల ఏర్పాటుతో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎంతో మందికి ఉపాధి లభిస్తుందని చెప్పారు. ఇక్కడ తయారయ్యే జూట్ ఉత్పత్తులను రాష్ట్రానికి ఇవ్వాలన్నారు.

ఈ ఒప్పందం ప్రకారం కామారెడ్డి, వరంగల్, సిరిసిల్ల జిల్లాల్లో జూట్ మిల్లులను ఏర్పాటు చేయనున్నారు

## రాజు ఆత్మహత్యపై అనుమానాలొద్దు : డీజీపీ మహేందర్‌రెడ్డి

హైదరాబాద్ , సెప్టెంబర్ 17:సైదాబాద్ సింగరేణి కాలనీకి చెందిన చిన్నారిపై హత్యాచార ఘటన కేసులో నిందితుడు రాజు ఆత్మహత్యపై ఎలాంటి అనుమానాలకు తావు లేదని డీజీపీ మహేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాజు ఆత్మహత్యపై అనుమానాలొద్దని, ఆత్మహత్య చేసుకుంటుండగా ఏడుగురు ప్రత్యక్ష సాక్షులు చూశారన్నారు. ఇందులో కోణార్క్ ట్రైన్‌కు సంబంధించిన లోకో పైలట్లు, ముగ్గురు రైతులు, ఇద్దరు రైల్వే గ్యాంగ్‌మన్లు సాక్షులని తెలిపారు.

అతను ఆత్మహత్యకు ముందు ట్రాక్‌పై తిరగడం గాంగ్‌మెన్ చూశాడని పేర్కొన్నారు. వెంటనే అతన్ని ప్రశ్నించగా.. పక్కనున్న చెట్ల పొదల్లోకి పారిపోయాడని.. మళ్లీ కాసేపటికి తిరిగివచ్చిన గాంగ్‌మెన్‌కు పట్టాలపై రాజు శవం కనిపించిందని తెలిపారు. రాజు ఆత్మహత్య చేసుకోవడానికి రైలు కింద పడడం అక్కడే పంట పొలాల్లో పనిచేస్తున్న రైతులు కూడా చూశారని పేర్కొన్నారు. రైలు లోకో పైలట్లు సైతం సంబంధిత అధికారులకు సమాచారం తెలియజేశారని డీజీపీ చెప్పారు.

సాక్షుల వీడియో స్టేట్‌మెంట్ వీడియో రికార్డు చేసినట్లు పేర్కొన్నారు. ఆత్మహత్యపై ఘన్‌పూర్‌తో పాటు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో ఇద్దరు లోకో పైలట్లు ఘటనను ఇద్దరు అధికారికంగా రికార్డు చేశారని తెలిపారు. నిందితుడు రాజు ఆత్మహత్యపై అనవసర రాద్ధాంతాలు వద్దని.. ఎవరి వద్దనైనా ఆధారాలుంటే మాట్లాడాలని సూచించారు. తప్పుదోవ పట్టించే విధంగా ఎవరూ ప్రయత్నించొద్దని డీజీపీ కోరారు.

## తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా సతీశ్ చంద్రశర్మ!



హైదరాబాద్ , సెప్టెంబర్ 17:తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా సతీశ్ చంద్రశర్మ పేరును సుప్రీం కోర్టు కోలీజియం సిఫారసు చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆయన కర్ణాటక యాక్టింగ్ సీజేగా పని చేస్తున్నారు. తెలంగాణ హైకోర్టు సీజేగా పని చేసిన జస్టిస్ హిమాకోహ్లి సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా వెళ్లారు. ప్రస్తుతం తాత్కాలిక సీజేగా రామచంద్రరావు కొనసాగుతున్నారు. అయితే సుప్రీం కొలీజియం చేసిన సిఫారసును రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు పంపారు. ఆంధ్రప్రదేశ్ సీజేగా జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాను నియమిస్తూ కూడా సుప్రీం కొలీజియం సిఫారసు చేసినట్లు తెలుస్తోంది.

సుప్రీంకోర్టు కొలీజియం మొత్తం 8 మంది జడ్జీలను వివిధ హైకోర్టులకు చీఫ్ జస్టిస్‌లను చేస్తూ పదోన్నతి కల్పించినట్లు తెలుస్తోంది. మొత్తం అయిదుగురు సీజేలను, 28 మంది జడ్జీలను బదిలీ చేయాలని సిఫారసు చేసింది. కొత్త సీజేలుగా నియమితులైన వారిలో.. అలహాబాద్ కోర్టుకు జస్టిస్ రాజేశ్ బిందాల్, కోల్‌కతా కోర్టుకు ప్రకాశ్ శ్రీవాత్సవ్, ఆంధ్రప్రదేశ్ కోర్టుకు ప్రశాంత్ కుమార్ మిశ్రా, కర్నాటక కోర్టుకు రీతూ రాజ్ అవాస్తి, తెలంగాణ హైకోర్టుకు సతీష్ చంద్ర శర్మ, మేఘాలయా కోర్టుకు జస్టిస్ రంజిన్ వీ మోరే, గుజరాత్ కోర్టుకు అరవింద్ కుమార్, మధ్యప్రదేశ్ కోర్టుకు ఆర్‌వీ మాలిమత్‌లను సీజేలుగా నియమిస్తూ సిఫారసు చేశారు. ట్రాన్స్‌ఫర్ అయిన సీజేల్లో.. ఏపీ నుంచి చత్తీస్‌ఘడ్‌కు అరూప్ కుమార్ గోస్వామి, మధ్యప్రదేశ్ నుంచి హిమాచల్ ప్రదేశ్‌కు మొహమ్మద్ రఫిక్, త్రిపుర నుంచి రాజస్థాన్‌కు అఖిల్ ఖురేషి, రాజస్థాన్ నుంచి త్రిపురకు ఇంద్రజిత్ మహంతి, మేఘాలయా నుంచి సిక్కింకు జస్టిస్ బిశ్వనాథ్ సోమద్దార్ బదిలీ అయ్యారు.

## ఆఫ్ఘనిస్తాన్‌లో తీవ్రవాదాన్ని నియంత్రించాలి.. షాంఘై దేశాలను కోరిన మోదీ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17: పెరిగిపోతున్న తీవ్రవాదం ప్రపంచ శాంతి అతిపెద్ద విఘాతంగా మారుతున్నట్లు ప్రధాని మోదీ అన్నారు. షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ సదస్సులో వర్చువల్ రీతిలో పాల్గొన్న ఆయన సభ్య దేశాలను ఉద్దేశించి మాట్లాడారు. ఇటీవల ఆఫ్ఘనిస్తాన్‌ను ఆక్రమించిన తాలిబన్ల అంశాన్ని పరోక్షంగా ప్రస్తావిస్తూ.. తీవ్రవాదుల ఆగడాల వల్ల ప్రపంచ శాంతి దెబ్బతింటోందన్నారు. ప్రాంతీయ స్థిరత్వంపై ఆందోళన వ్యక్తం చేసిన ఆయన.. గ్రూపులోని సభ్యులంతా కనెక్టివిటీ, నమ్మకం లాంటి అంశాలపై పరస్పరం పనిచేయాలన్నారు. ఆఫ్ఘనిస్తాన్‌లో ఏం జరుగుతుందో అందరికీ తెలుసు అని, అక్కడ రాడికలైజేషన్, తీవ్రవాదం పెరగకుండా చూడాల్సిన బాధ్యతను ఎస్సీవో సభ్యులు నిర్వర్తించాలన్నారు.

సెంట్రల్ ఏషియా చరిత్రను పరిశీలిస్తే, అక్కడ ప్రగతిశీల సంస్కృతులు, విలువలు సమ్మిళితం అయ్యాయన్నారు. కొన్ని శతాబ్దాల పాటు సూఫిజం ఇక్కడ వర్ధిల్లిందన్నారు. ఆసియా ప్రాంతమంతా అది వ్యాపించిందని, ఇక్కడ ప్రాంతీయ సంస్కృతుల్లో ఆ పద్ధతులను చూడవచ్చు అని ప్రధాని మోదీ తెలిపారు. సెంట్రల్ ఏషియాలో ఉన్న చారిత్రక వారసత్వాన్ని పరిశీలిస్తే, ఎస్సీవో సభ్యదేశాలు తీవ్రవాదంపై కలిసి పోరోడాల్సి వస్తోందన్నారు. ఇండియాతో పాటు అన్ని ఎస్సీవో సభ్యదేశాల్లో ఇస్లామ్‌తో అనుబంధం కలిగి ఉన్న ఎన్నో ఇన్‌స్టిట్యూషన్లు ఉన్నట్లు ఆయన తెలిపారు. షాంఘై సహకార సంస్థ 2001లో ఏర్పాటైంది. కజకిస్తాన్, చైనా, కిర్గిస్తాన్, రష్యా, తజికిస్తాన్, ఉజ్బెకిస్తాన్, ఇండియా, పాకిస్థాన్, ఇరాన్ సభ్య దేశాలుగా ఉన్నాయి. పొరుగు సంబంధాలను, పరస్పర విశ్వాసాన్ని పెంచుకోవాలన్న లక్ష్యంతో ఎస్సీవోను ప్రారంభించారు.

## మానవ మనుగడకు మొక్కలే ప్రాణం: సీఎం కేసీఆర్



హైదరాబాద్ , సెప్టెంబర్ 17:మనిషి మనుగడకు మొక్కలు తప్పనిసరి అని, మానవ జీవితంలో అతిగొప్ప పని మొక్కలు నాటడమేనని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. మొక్కలు పెంచాలి, పర్యావరణాన్ని కాపాడాలి అన్న ఆచరణ స్ఫూర్తితో తెలంగాణ ప్రభుత్వం ముందుకు సాగుతుందని చెప్పారు. రాజ్యసభ సభ్యులు జోగినపల్లి సంతోష్ కుమార్ పర్యావరణానికి సంబంధించి వినూత్నంగా చేపట్టిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్, తెలంగాణ హరితహారం కార్యక్రమాలకు విస్తృత ప్రచారం కల్పించే కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఉద్యమాన్ని నిక్షిప్తం చేసిన "మట్టి చిగురు" పుస్తకాన్ని ప్రగతి భవన్లో ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోవాల్సిన బాధ్యత పౌరసమాజం పై ఉందని చెప్పారు. ఈ నేపథ్యంలో ఈ పుస్తకాన్ని వెలువరించినందుకు అభినందించారు. సంతోష్ కుమార్ చేపట్టిన చిట్టి మొలకలతో పెరుగుతున్న వృక్షసంపద, పర్యావరణ పరిరక్షణను ఈ పుస్తకంలో తెలియజేశారన్నారు. ప్రపంచవ్యాప్తంగా మరీ ముఖ్యంగా భారత దేశ వ్యాప్తంగా పర్యావరణం కోసం తమ ప్రాణాలను పణంగా పెట్టి విజయం సాధించిన సామాన్యుల అసమాన్య ధీరోదాత్త గాథలు,నిత్యం స్ఫూర్తిదాయకంగా ఉండేలా "మట్టి చిగురు " పుస్తకాన్ని తీర్చిదిద్దడం బాగుందన్నారు.

చిప్కో ఉద్యమ కారుడు సుందర్ లాల్ బహుగుణ, స్వచ్ఛ విత్తనాల కోసం గళమెత్తిన వందనాశివ,నర్మదాబచావో ఆందోళన, తెహ్రీడ్యామ్ వ్యతిరేక ఉద్యమం పాండురంగా హెగ్డే, "అప్పికో" ఆందోళన, రాజేంద్రసింగ్ జోహడ్ పథకం, గూగుల్ పై ఆకుపచ్చని గీత గా నిలిచిన వనజీవి రామయ్య, రోడ్ పొడవునా మొక్కలు నాటిన సాలుమరద తిమ్మక్క,1360 ఎకరాల అడవిని పెంచిన జాదవ్ పాయెంగ్ లాంటి పర్యావరణ ఉద్యమకారుల్ని ఈ పుస్తకం తెలియజేస్తుంది.

## రైల్ కౌశల్ వికాస్ యోజనను ప్రారంభించిన కేంద్రమంత్రి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17: ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన (ఖఓఐఙ) ఆధ్వర్యంలో రైల్ కౌశల్ వికాస్ యోజన (ఖీఐఙ) కార్యక్రమాన్ని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా ఎలక్ట్రీషియన్, వెల్డర్, మెషినిస్ట్, ఫిట్టర్ కోర్సులపై భారతీయ రైల్వే శిక్షణ ఇవ్వనున్నది. రాబోయే మూడేళ్లలో 50వేల మందికి శిక్షణ ఇవ్వనుండగా.. ప్రారంభంలో వెయ్యి మంది అభ్యర్థులకు శిక్షణ ఇవ్వనున్నారు. ఆయా కోర్సుల్లో ప్రాథమికంగా వంద గంటల పాటు శిక్షణ ఉండనుంది.

ప్రాంతీయ డిమాండ్, అవసరాల అంచనా మేరకు జోనల్ రైల్వే, ప్రొడక్షన్ యూనిట్లు, ఇతర ట్రేడ్లలో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నారు. పదో తరగతి మార్కుల ఆధారంగా పూర్తి పారదర్శకంగా, ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించి అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు. పదో తరగతి ఉత్తీర్ణులై, 1-35 సంవత్సరాల మధ్య ఉన్న అభ్యర్థులు కార్యక్రమంలో శిక్షణ కోసం దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. అయితే శిక్షణ ఆధారంగా రైల్వేలో ఉద్యోగం పొందేందుకు ఎలాంటి హక్కు ఉండదని అధికారులు పేర్కొన్నారు.

శిక్షణకు సంబంధించిన పాఠ్యాంశాలను బనారస్ లోకోమోటివ్ వర్క్స్ రూపొందించింది. శిక్షణ పూర్తి చేసుకున్న అనంతరం అభ్యర్థులకు నేషనల్ రైల్ అండ్ ట్రాన్స్‌పోర్టేషన్ ఇన్‌స్టిట్యూట్ నుంచి సర్టిఫికెట్‌తో పాటు ట్రేడ్ టూల్‌కిట్లు ఇవ్వనున్నారు. ఆర్‌కేవీవై కింద మారుమూల ప్రాంతాల్లోనూ శిక్షణ ఇవ్వనున్నట్లు రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. గుణాత్మక మెరుగుదల కోసం వివిధ ట్రేడ్‌లలో యువతకు శిక్షణ నైపుణ్యాలు అందించడమే ఆర్‌కేవీవై లక్ష్యమన్నారు. అవకాశాన్ని యువత వినియోగించుకోవాలని సూచించారు.

## అటవీ శాఖ సిబ్బందిపై దాడిని ఖండించిన మంత్రి ఐకే రెడ్డి




హైదరాబాద్ , సెప్టెంబర్ 17: విధి నిర్వహణలో ఉన్న సిబ్బందిపై దాడులు చేయటం సమంజసం కాదని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకర్ రెడ్డి అన్నారు. పోడు భూముల సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా అజంనగర్ రేంజ్ పందిపంపుల గ్రామ పరిధిలో నిన్న (16/09/2021) అటవీ అధికారులు, సిబ్బందిపై జరిగిన దాడిని మంత్రి ఖండించారు.

విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా పనిచేస్తున్న సిబ్బందిపై గ్రామస్థులు దాడి చేయటం సరైంది కాదన్నారు. తప్పు చేసిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. దాడి సమాచారం తెలుసుకున్న మంత్రి అరణ్య భవన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బాధిత రేంజ్ అధికారి గూడూరి దివ్య, ఇతర సిబ్బందితో నేరుగా మాట్లాడారు.

సంఘటనపై ఆరా తీశారు. వారి ఆరోగ్య పరిస్థితితో పాటు, ఇతర ప్రభుత్వ శాఖలు స్పందించిన తీరును అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి హామీ ఇచ్చారు. పోడు సమస్య పరిష్కారంపై ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటుచేసిందని, తొలి సమావేశం రేపటి శనివారం జరుగుతుందన్నారు.

అటవీ పునర్జీవనంలో భాగంగా అటవీ భూముల్లో అధికారులు మొక్కలు నాటుతున్నారని, ఇది వారి వ్యక్తిగత విషయం కాదని అందరూ గుర్తించాలన్నారు. దాడులు చేయడం వల్ల సమస్య పరిష్కారం కాదని గుర్తించాలన్నారు.

వీడియో కాన్ఫరెన్స్ లో ఉన్నతాధికారులతో పాటు అన్ని సర్కిళ్లు, జిల్లాల అటవీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ప్రభుత్వ ప్రాధామ్యాలకు అనుగుణంగా తాము పనిచేస్తున్నామని, తెలంగాణకు హరితహారంలో భాగంగా అడవుల రక్షణ, అటవీ పునరుద్ధరణ పనుల్లో పాల్గొంటున్నామని తెలిపారు. క్షేత్ర స్థాయిలో ఎదురౌతున్న సమస్యలను వివరించారు.

అటవీభూమిలో నాటిన నాలుగు వేల పండ్ల మొక్కలను తొలగించి, పోడుదారులు సాగు ప్రయత్నం చేశారని, గతంలో ఇలాంటి ప్రయత్నం చేస్తే వారించి, అటవీ భూమిని ఆక్రమించబోమని వారి నుంచి లిఖిత పూర్వకహామీ కూడా తీసుకున్నామని రేంజ్ అధికారి దివ్య తెలిపారు. ఆ భూముల పరిశీలనకు వెళ్లిన తమపై విచక్షణారహితంగా దాడి చేశారని వివరించారు.దాడులకు వెరవకుండా విధి నిర్వహణలో పాల్గొన్న రేంజ్ ఆఫీసర్ తో పాటు, అటవీ సిబ్బందిని అటవీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఏ. శాంతికుమారి ప్రశంసించారు. కలెక్టర్ నేతృత్వంలో జిల్లాల వారీగా ఏర్పాటైన ఫారెస్ట్ ప్రొటెక్షన్ కమిటీలు ఇలాంటి సంఘటనలపై తక్షణం స్పందించాలని అటవీ సంరక్షణ ప్రధాన అధికారి (పీసీసీఎఫ్) ఆర్. శోభ కోరారు.

రాష్ట్ర అటవీ అధికారుల సంఘం, ఫారెస్ట్ రేంజ్ అధికారుల సంఘం, జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్ల అసోసియేషన్ తరపున ప్రతినిధులు దాడి సంఘటనను ఖండించారు. ప్రభుత్వం తమకు అండగా ఉన్నందుకు మంత్రితో పాటు ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో పీసీసీఎఫ్ (సోషల్ ఫారెస్ట్రీ) ఆర్.ఎం. డోబ్రియల్, పీసీసీఎఫ్ (కంపా) లోకేష్ జైస్వాల్, పీసీసీఎఫ్ (అడ్మిన్) స్వర్గం శ్రీనివాస్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అసెంబ్లీ సమావేశాలకు నోటిఫికేషన్

హైదరాబాద్ , సెప్టెంబర్ 17: తెలంగాణ శాసనసభ, శాసన మండలి సమావేశాల కోసం గెజిట్ నోటిఫికేషన్ జారీ అయ్యింది. ఈ నెల 24న ఉదయం 11 గంటలకు ఉభయ సభలు ప్రారంభంకానున్నాయి. గురువారం సీఎం కేసీఆర్ అధ్యక్షతన కేబినెట్ సమావేశం జరిగిన విషయం తెలిసిందే. సమావేశంలో ఈ నెల 24 నుంచి అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించింది. ఈ క్రమంలో శుక్రవారం గవర్నర్ తమిళిసై సమావేశాల నిర్వహణకు నోటిఫికేషన్ జారీ చేశారు.

## చరిత్రలో నేటినిజం



కం॥ నరవరు వెల్లకు మెచ్చెడ
వరతాతయం లైన నటనపై తనదృష్టిన్
నిరతము నిలుపుచు ప్రజలకు
సరవశము నొసగగలదు 'షబానా ఆజ్మీ' !!

(సెప్టెంబర్ 18 నటి షబానా ఆజ్మీ పుట్టిన రోజు..)



-రాధశ్రీ

సెల్: 9494481210

## మహాగణపతిని దర్శించుకున్న మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి



హైదరాబాద్ , సెప్టెంబర్ 17: ఖైరతాబాద్ గణేషుడిని దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి దర్శించుకున్నారు. శుక్రవారం మహగణపతి దర్శనానికి వెళ్లిన మంత్రి ఇంద్రకరణ్ రెడ్డికి గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మంత్రికి తీర్థ ప్రసాదాలు అందజేసి శాలువాతో సత్కరించారు.

## లక్నోలో జీఎస్టీ మండలి సమావేశం.. హాజరైన మంత్రి హరీశ్ రావు

హైదరాబాద్ , సెప్టెంబర్ 17:జీఎస్టీ మండలి 45వ సమావేశం ప్రారంభమయింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో జరుగుతున్న ఈ సమావేశానికి రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్ రావు హాజరయ్యారు. కరోనా పరిస్థితుల నేపథ్యంలో దాదాపు 20 నెలల తర్వాత తొలిసారి ప్రత్యక్షంగా ఈ సమావేశం జరుగుతుండటం విశేషం. గత రెండేండ్లుగా ఈ సమావేశాలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారానే జరుగుతున్నాయి.

ప్రస్తుత సమావేశంలో జీఎస్టీ మండలి పలు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశాలున్నాయి. 11 రకాల కొవిడ్ ఔషధాలపై పన్ను రాయితీలను పొడిగించనున్నారు. అదేవిధంగా పెట్రోలియం ఉత్పత్తులను జీఎస్టీ పరిధిలోకి తెచ్చే ప్రతిపాదనపై చర్చించే అవకాశం ఉంది. ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ సేవలను కూడా జీఎస్టీ పరిధిలోకి తీసుకురావడంతోపాటు మరో 48 రకాల వస్తువులపై పన్ను రేట్లను ఈ భేటీలో సమీక్షించనున్నారు.

## కోవిడ్ టీకా లబ్ధిదారులతో నేడు సమావేశం కానున్న ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17:కోవిడ్ టీకా మందు ఒకటో డోసు ను గోవా లో వయోజనులు అందరికీ ఇప్పించడం పూర్తి అయిన సందర్భం లో, కోవిడ్ టీకా లబ్ధిదారుల తోను, ఆరోగ్య సంరక్షణ కార్యకర్తల తోను ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ 2021 సెప్టెంబర్ 18న ఉదయం 10:30 గంటల కు వీడియో కాన్ఫరెన్స్ మాధ్యమం ద్వారా సమావేశం కానున్నారు.

ప్రజల కు టీకా మందు ను ఇప్పించే కార్యక్రమం సఫలం అయ్యేటట్లు గా ఆ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రయాసల లో.. సాముదాయక జన సమీకరణ, అట్టడుగు స్థాయి ప్రాంతాల కు కూడా చేరుకోవడానికి అనువు గా అదే పని గా టీకా ఉత్సవ్ ల ను నిర్వహించడం, పని ప్రదేశాలు, వృద్ధాశ్రమాలు, దివ్యాంగజనులు వంటి ప్రాధాన్య సమూహాల కు టీకాకరణ, సందేహాల ను, భయాందోళనల ను నివృత్తి చేయడం కోసం తీసుకొన్న చొరవ లు వంటివి భాగం గా ఉన్నాయి. టీకాల ను త్వరిత గతి న ఇప్పించే క్రమం లో ఆ రాష్ట్రం తౌక్తే తుఫాను వంటి సవాళ్ళ ను కూడా అధిగమించింది.

# నీరే ప్రాణికోటికి జీవనాధారం

**(18 సెప్టెంబర్ 'ప్రపంచ జల పర్యవేక్షణ దినం' సందర్భంగా)**

సౌరమండంలోని భూగ్రహంపై మాత్రమే నీరు ఉండడంతో జీవరాశుల మనుగడ సాధ్యమైందన మనకు విధితమే. ప్రాణికోటికి జలమే జీవనాధారం. ప్రాణి శరీరంలోనే కాకుండా భూగ్రహ ఉపరితలంపై కూడా 70 శాతానికి పైగా జలమే ఆక్రమించి ఉన్నది. ధరణిపై ఉన్న నీటిలో 3 శాతం మాత్రమే మానవ వినియోగ యోగ్యతను (ఫ్రెష్ వాటర్) కలిగి ఉంది.

జీవకోటి మనుగడకు సార్వత్రిక ద్రావణిగా నీరే ప్రధాన ఆధారం అవుతున్నది. పర్యావరణంలో కీలక భాగంగా జలావరణం గుర్తించబడింది. జంతువృక్ష రాజ్యాలు జలంతోనే ఆరోగ్యకర జీవనం సాగిస్తున్నాయి. ధరణిపై నీటి నిల్వల ప్రాధాన్యతలను గుర్తించిన 'అమెరికన్ క్లీన్ వాటర్ ఫౌండేషన్' ఆలోచనల ఫలితంగా 2003 నుంచి ప్రతి ఏట 18 సెప్టెంబర్‌న 'ప్రపంచ జల పర్యవేక్షణ దినం' పాటించుట ఆనవాయితీగా మారింది. భూఉపరితంపైన వాటర్ బాడీస్ మాత్రమే కాకుండా భూగర్భ జల నిల్వలను పరిరక్షించడానికి, నీటి నాణ్యతలను కాపాడడానికి, నీటి ప్రాధాన్యతలను సామాన్య ప్రజానీకానికి వివరించడానికి ఈ వేదికలను వినియోగిస్తారు. నీటి నాణ్యతలను నిర్ణయించే అంశాల్లో ఉష్ణోగ్రత, ఆమ్లత్వం, క్లారిటీ (టర్బిడిటీ), కరిగి ఉన్న ఆక్సిజన్ (డిసాల్వ్‌డ్ ఆక్సిజన్) లాంటి ధర్మాలను పరిగణలోకి తీసుకుంటారు.

నీటిని పరిమితంగా వాడుకోవడం మానవాళి జీవన విధానం కావాలి. మనకు కలిగే అనారోగ్యాలలో సగానికి పైగా రోగాలు కలుషిత నీటి నుంచే వ్యాపిస్తాయని తెలుసుకోవాలి. మన పరిసర చెరువులు, కుంటలు, వాగులు, వంకలు, నదులు, బావులు, సరస్సులు, సాగరాలు లాంటి వాటర్ బాడీలను దైవసమానంగా రక్షించుకోవాలి. ప్రపంచవ్యాప్తంగా 800 మిలియన్ల ప్రజలు సురక్షిత త్రాగు నీటికి దూరంగా జీవితాలను గడుపుతున్నారు. పిల్లలు అధికంగా నీటి సంబంధ వ్యాధులతో మరణిస్తున్నారు. నీటి నిల్వల రక్షణ, నీటి వినియోగంలో క్రమశిక్షణ, నీటి కొరతకు కారణాలను తెలుసుకొని సత్వర చర్యలు తీసుకోవడం, నీటి నాణ్యతలను కాపాడటం, పారిశుద్ధ్య సవాళ్ళను అధిగమించడం, నీటి నిల్వల ప్రాజెక్టులను నిర్మించుకోవడం, నీటిని సహజ అమూల్య వనరుగా గుర్తించడం, ప్రతికూల వాతావరణ మార్పులను నిరోధించడం లాంటి అంశాల పట్ల పిల్లల నుంచి పెద్దల వరకు సంపూర్ణ అవగాహనకు 'ప్రపంచ జల పరిరక్షణ దినం' వేదికను వినియోగించాలి. విశ్వవ్యాప్తంగా నీటి కొరత పెద్ద సమస్యగా మారనుంది. రాబోయే రోజుల్లో జలం కోసం జగడాలు జరుగుతాయని వింటున్నాం. నదీజలాల వాటాలు, పంపిణీ అంశాల ఆధారంగా ప్రాంతాలు, రాష్ట్రాలు, దేశాల మధ్య దూరాలు పెరిగిపోతుండడం చూస్తున్నాం.

పర్యావరణ మార్పులు, మహా విపత్తులతో కరువు కాటకాలు సాధారణం అయ్యాయి. నేలపై మూడొంతుల జలమే ఉన్నది. సహజ జలంలో త్రాగు నీటి లభ్యత అతి తక్కువ (3 శాతం మాత్రమే). ఉచితంగా లభించాల్సిన సురక్షిత జలం లీటరుకు కనీసం రూ. 15/- వెచ్చించాల్సి వస్తున్నది. నేడు పలు గ్రామీణ కుటుంబాలు కూడా త్రాగు నీటిని మినరల్ వాటర్ రూపంలో కొనుక్కొని వాడుకోవలసి వస్తున్నది. జీవుల మనుగడకు నీరు ఎంత ప్రధానమో, పర్యావరణ పరిరక్షణకు కూడా అంతే ముఖ్యమైందిగా గుర్తించబడింది. మన దైనందిన జీవన చక్రంలో నీటికి ప్రధాన భూమిక ఇవ్వబడింది. ఆహార పదార్థాల ఉత్పత్తికి కూడా నీరే ప్రధాన ఆధారం. వన్యప్రాణుల ఉనికి, వాతావరణ సమతుల్యత నీటి లభ్యత మీదనే ఆధారపడి ఉన్నాయి. నీటి వ్యర్థాన్ని తగ్గించడం మన కనీస బాధ్యతగా గుర్తుంచుకోవాలి. స్థానిక సంస్థల నుంచి మె?దలు కేంద్ర ప్రభుత్వం వరకు జల వనరుల పరిరక్షణకు అధిక నిధులు కేటాయించాల్సి వస్తున్నది. నీటి పొదుపు ఎంత ముఖ్యమో, నీరు కాలుష్యం కాకుండా చూసుకోవడమ కూడా అంతే ప్రధానం. పారిశ్రామిక, వ్యవసాయ రంగాలు నీటి కాలుష్యానికి కారణం అవుతున్నాయని గమనించాలి. జలాశయాల నిర్వహణ, అడవులను రక్షించుకోవడం, నీటి పరిరక్షణ చట్టాల అమలు, నీటి రీసైక్లింగ్, వర్షపు నీటిని ఇంకుడు గుంటలు/వాటర్‌షెడ్/చెక్ డ్యామ్‌ల నిర్మాణాలతో ఒడిసి పట్టడం, గృహాల్లో నీటి వ్యర్థాలను అరికట్టడం, నీటిని అమూల్య వనరుగా భావించడం మనందరి కర్తవ్యం అని అర్థం చేసుకోవాలి. నేటి నీటి పొదుపు రేపటి ఆరోగ్యవంతమైన తరాల మనుగడకు అమూల్య వరం కావాలి. జలమే జీవనం, నీరే ప్రాణాధారమని నీటి నిల్వలకు ప్రాధాన్యతనిస్తూ, సురక్షిత నీటిని వినియోగిస్తూ, ఆరోగ్యవంతమైన మానవ సమాజాన్ని నిర్మిద్దాం.



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

## టి జి పి ఏ రాష్ట్ర మహిళ విభాగ ప్రధాన కార్యదర్శిగా పత్రి లలిత రాణి..!



సంగారెడ్డి సెప్టెంబర్ 17 (నేటినిజం ప్రతినిధి) హైదరాబాద్ లో గురువారం జరిగిన రాష్ట్ర కమిటి కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా,వాసి తెలంగాణ గురుకుల పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర మహిళవింగ్ ప్రధాన కార్యదర్శిగా పత్రి లలిత రాణిని రాష్ట్ర మహిళ వింగ్ అధ్యక్షురాలు,రాష్ట్ర జనరల్ వింగ్ అధ్యక్షులు ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. పలు భవిష్యత్తు కార్యకలపాల గురించి చర్చించి ఈ ఎన్నికలు నిర్వహించినట్లు రాష్ట్ర మహిళ వింగ్ అధ్యక్షురాలు ఏరోల్లా నాగమణి తెలిపారు. అనంతరం పత్రి లలిత రాణి మాట్లాడుతూ గురుకుల విద్యార్థుల విద్య విధానాలలో,భవిష్యత్తు కార్యక్రమాలలో తన వంతు కృషి చేస్తానని,రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకునందుకు రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు.

## రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

### -ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు



కోరుట్ల, సెప్టెంబర్ 17: : తెలంగాణ ప్రభుత్వం రైతన్నల సంక్షేమం, అభివృద్దే లక్ష్యంగా పని చేస్తున్నదని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, డీసీసీబీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు అన్నారు. గురువారం వారు పట్టణంలోని కల్లూరు రోడ్డు ఎస్సారెస్పీ క్వార్టర్స్? సముదాయంలో నూతనంగా నిర్మించనున్న కేడీసీసీ బ్యాంకు, సహకార సంఘ భవనం, గోదాం నిర్మాణ పనుల శిలాఫలకాలను ఆవిష్కరించి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.

దేశంలోనే ఎక్కడలేని విధంగా సీఎం కేసీఆర్ అన్ని వర్గాల అభ్యున్నతికి అనేక రకాల సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రవేశ పెట్టి అమలు చేస్తున్నారని కొనియాడారు. తెలంగాణ రాక ముందు 4 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోదాంలు ఉండేవని, తెలంగాణ వచ్చిన తర్వాత 25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని నిలువచేసే గోదాంలను నిర్మించడం జరిగిందన్నారు. 4 లక్షల ఎకరాల్లో రైతులు వివిధ రకాల పంటలను సాగు చేస్తున్నారని, 4 కోట్ల మెట్రిక్ టన్నుల పంట దిగుబడి రానున్నదన్నారు. రైతులకు అందుబాటులో ఉండేలా సొసైటీ భవనాలను నిర్మిస్తున్నామని, పంట నిల్వ కోసం అవసరమైన చోట్ల గిడ్డంగులను నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నారు.

రైతుల మేలు కోరే ప్రభుత్వానికి అన్నదాతలు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జడ్పీచైర్‌పర్సన్ దావ వసంత, డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షురాలు అన్నం లావణ్య, ఉపాధ్యక్షుడు గడ్డమీది పవన్, ఎంపీపీ తోట నారాయణ, జిల్లా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, జిల్లా రైతు బంధు సమితి అధ్యక్షుడు చీటి వెంకటరావు, టీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు అన్నం అనిల్, ప్రధాన కార్యదర్శి గుడ్ల మనోహర్, సొసైటీ చైర్మన్‌లు, ఏఎంసీ అధ్యక్షులు, డైరెక్టర్లు, కౌన్సిలర్లు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

టీటీడీ సభ్యుడిగా నియమితులైన కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావును గురువారం ప్రజా ప్రతినిధులు, అధికారులు, యువజన సంఘాల ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కోరుట్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వచ్చిన ఎమ్మెల్యేకు జడ్పీచైర్‌పర్సన్ దావ వసంత, డీసీసీబీ అధ్యక్షుడు కొండూరి రవీందర్‌రావుతో పాటు పలువురు ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

## 2024లో తెలంగాణలో అధికారంలోకి వస్తాం: అమిత్‌షా

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17:తెలంగాణలో 2024లో జరిగే ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తామని తెలిపారు. మజ్లీస్ పార్టీకి బీజేపీ పార్టీ అస్సలు భయపడదని? తెలంగాణ ప్రజలందరికీ విమోచన దినోత్సవ శుభాకాంక్షలు అని అమిత్ షా తెలిపారు.సర్దార్ పటేల్ సైనిక చర్య కారణంగానే తెలంగాణ రాష్ట్రానికి స్వేచ్ఛ లభించిందని అమిత్ షా అన్నారు. నిజాం రాక్షస పాలను నుంచి తెలంగాణ రాష్ట్రానికి విముక్తి కలిగిన రోజు సెప్టెంబర్ 17వ తేదీ అని ఆయన పేర్కొన్నారు. సెప్టెంబర్ 17వ తేదీని.. విమోచన దినోత్సవం గా నిర్వహించాలని అప్పట్లో సీఎం కేసీఆర్ డిమాండ్ చేశారని? మరి ఇప్పుడు కేసీఆర్ డిమాండ్ ఏమైందని అమిత్ షా నిలదీశారు. కేసీఆర్? విమోచన దినాన్ని ఎందుకు అధికారికంగా నిర్వహించడం లేదని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ ఎవరికీ భయపడుతున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు.

## అటల్ ఇన్నోవేషన్ మిషన్ డసాల్ట్ సిస్టమ్స్ భాగస్వామ్యం ఆవిష్కరణకు మరో ఊపునిస్తుంది

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17:అటల్ ఇన్నోవేషన్ మిషన్ (ఎయిమ్) నీతి ఆయోగ్ డసాల్ట్ సిస్టమ్స్ భాగస్వామ్యంతో దేశవ్యాప్తంగా ఆవిష్కరణ మరియు వ్యవస్థాపక పర్యావరణ వ్యవస్థను పెంపొందించడానికి సిద్ధంగా ఉంది.

ఈ విషయంలో భారతదేశంలో ఎయిమ్ ప్రోగ్రామ్‌లు మరియు ఎయిమ్ లబ్ధిదారుల ప్రస్తుత మరియు భవిష్యత్తు కార్యక్రమాలకు మద్దతు ఇచ్చేందుకు వర్చువల్ ఈవెంట్‌లో ఈరోజు ఎయిమ్ మరియు డసాల్ట్ సిస్టమ్స్ మధ్య స్టేట్‌మెంట్ ఆఫ్ ఇంటెంట్ (ఎస్‌ఓఐ) సంతకం చేయబడింది.

ఈ ఎస్‌ఓఐ కింద, అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు ( ఎటిఎల్‌లు), ఎయిమ్ ఇంక్యుబేటర్‌లు (ఎఐసీలులు మరియు ఈఐసీలు), అటల్ కమ్యూనిటీ ఇన్నోవేషన్ సెంటర్‌లు (ఎసిఐసి), అటల్ న్యూ ఇండియా ఛాలెంజ్ (ఎఎన్ఐసి) కింద మంజూరు చేసిన ఎయిమ్ లబ్ధిదారులకు స్మాల్ ఎంటర్‌ప్రైజ్ కోసం ఆవిష్కరణ (అరైజ్)కు దసో సిస్టమ్స్ మద్దతు ఇస్తుంది మరియు ప్రోత్సహిస్తుంది.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలలో ఆవిష్కరణ మరియు వ్యవస్థాపకతను ప్రోత్సహించే లక్ష్యంతో ఈ కార్యక్రమం సమాజంలో ఆవిష్కరణలను వేగవంతం చేయడానికి బహిరంగ ఆవిష్కరణ సహకారానికి ఉత్ప్రేరకంగా పనిచేస్తుంది.

దసో మరియు ఎయిమ్, నీతి ఆయోగ్ మధ్య జరిగిన ఈ ఎస్‌ఓఐ ఆరు అంశాలను కలిగి ఉంది. వీటిలో ఎంచుకున్న ఎయిమ్ స్టార్ట్ అప్‌లకు డసాల్ట్ సిస్టమ్స్ యొక్క 3డి ఎక్స్‌పీరియన్స్ ల్యాబ్ స్టార్ట్-అప్ యాక్సిలరేషన్ ప్రోగ్రామ్ యాక్సెస్ ఉంటుంది; ఎంపికచేసిన ఎయిమ్ స్టార్ట్-అప్‌లకు వారి ఉత్పత్తుల సామర్థ్యం పెంపొందించడానికి మార్గదర్శకత్వం; ఎంపికచేసిన ఎయిమ్ స్టార్ట్-అప్‌లకు 3డి ఎక్స్‌పీరియన్స్ ల్యాబ్ సంబంధిత గ్లోబల్ కమ్యూనిటీ యాక్సెస్; ఎంపికచేసిన ఎయిమ్ స్టార్ట్-అప్‌లకు డసాల్ట్ సిస్టమ్స్ ప్రపంచవ్యాప్త కస్టమర్లు, భాగస్వాములు మరియు సాంకేతిక సహకారులు వర్తించేటప్పుడు పరిశ్రమతో కనెక్ట్ అవుతుంది; డసాల్ట్ సిస్టమ్స్ జాతీయ మరియు ప్రపంచ ఈవెంట్‌లలో ఎంపిక చేసిన ఎయిమ్ స్టార్ట్-అప్‌ల భాగస్వామ్యం; ఎయిమ్ మరియు నీతి ఆయోగ్ నిర్వహించే ఉమ్మడి ఈవెంట్‌లు, హ్యాకథాన్‌లు.

ఎయిమ్ మిషన్ డైరెక్టర్ డాక్టర్ చింతన్ వైష్ణవ్ తన అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ " డస్సాల్ట్‌తో భాగస్వామ్యం అనేది విన్-విన్ పార్టనర్‌షిప్ అని మరియు లబ్ధిదారులందరికి దేశంలో ఎయిమ్‌కు చెందిన విస్తరిస్తున్న పర్యావరణ వ్యవస్థకు ప్రాధాన్యతనిస్తుందని" అన్నారు."ఎంపిక చేసిన భారతీయ స్టార్టప్‌లకు ఈ చొరవ కొత్త అవకాశాలను అందిస్తుంది. ఎందుకంటే వారు డస్సాల్ట్ సిస్టమ్స్ గ్లోబల్ స్టార్ట్ అప్ ఎకోసిస్టమ్- వారి యాక్సిలరేటర్ ప్రోగ్రామ్‌కి మరియు తోటివారు, ఇండస్ట్రీ నిపుణులు, ఇంజనీర్లు, డిజైనర్‌లతో కనెక్ట్ అయ్యే అవకాశం మరియు 3డీ ఎక్స్‌పీరియన్స్ ల్యాబ్‌లో భాగమయ్యారు. స్టార్టప్‌లను వేగవంతం చేయగల సామర్థ్యం మరియు ప్రపంచవ్యాప్తంగా ఉన్న సమాజంతో నేను చాలా సంతోషిస్తున్నానని "అన్నారాయన.

డస్సాల్ట్ సిస్టమ్స్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ దీపక్ ఎన్‌జీ తన అభిప్రాయాలను పంచుకుంటూ " ఎయిమ్‌తో భాగస్వామ్యం అనేది దేశంలో మేకర్స్, ఇన్నోవేటర్‌ల పర్యావరణ వ్యవస్థను పెంపొందించడానికి డసాల్ట్ యొక్క నిబద్ధతను బలోపేతం చేసే దీర్ఘకాలిక సంబంధానికి నాంది" అని చెప్పారు.

"ఎయిమ్‌తో మా భాగస్వామ్యం స్టార్టప్‌లకు సాంకేతికత, పరిశ్రమ ఉత్తమ పద్ధతులు మరియు ప్రభుత్వం నడిచే విధానాలను ఎలా ప్రభావితం చేయగలవు అనే మా ఉమ్మడి లక్ష్యాలపై మరింత బలోపేతం చేస్తుంది," అని ఆయన అన్నారు, "మా 3డి ఎక్స్‌పీరియన్స్ ల్యాబ్ కొత్త డొమైన్‌లలో అభివృద్ధి చెందుతున్న స్టార్టప్‌ల కోసం టెక్నాలజీ మరియు కమ్యూనిటీని అందిస్తుంది ఎలక్ట్రిక్ వాహనాలు, బ్యాటరీలు మరియు ఛార్జింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, వైద్య పరికరాలు, ఎనర్జీ & మెటీరియల్స్ రంగం మరియు భవిష్యత్తులో పరిశ్రమ కోసం స్థిరమైన పరిష్కారాలను అందించే పొదుపు ఆవిష్కర్తలకు కూడా అది లభిస్తుందని "అని చెప్పారు.

## త్వరలోనే బీసీ బంధు పథకం



కామారెడ్డి : ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్‌రావు త్వరలోనే బీసీ బంధు పథకం అమలు చేయనున్నారని జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ షిండే తెలిపారు. గురువారం బిచ్కుంద మండలకేంద్రంలో కమ్మరి చెరువులో చేప పిల్లలు విడుదల చేసిన అనంతరం ఏర్పటు చేసిన గంగాపుత్ర కులస్తుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అట్టడుగున ఉన్న దళితులుఆర్థికంగా ఎదిగేందుకు ఉద్దేశించిన దళిత బంధుకు పెద్ద ఎత్తున నిధులు విడుదల చేశారని పేర్కొన్నారు. ఒక్కో కుటుంబానికి పది లక్షల ఆర్థిక సాయంతో ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారని తెలిపారు.

రాష్ట్రంలోని నాలుగు నియోజకవర్గాల్లో జుక్కల్ నియోజక వర్గం నిజాంసాగర్ మండలాన్ని ఎంపిక చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల నిర్వహించిన సమీక్ష సమావేశంలో బీసీలకు కూడా బీసీ బంధు పథకాన్ని ప్రవేశ పెడతామని సీఎం పేర్కొన్నారని తెలిపారు. రాష్ట్రంలో గంగపుత్ర కులస్తులకు చెరువుల్లో చేపలు పెంచుకోవడానికి చేప పిల్లలను పంపిణీ చేస్తుందని, వాటిని విక్రయించుకోవడానికి ద్విచక్రవాహనాలను కూడా అందించిందని తెలిపారు. గంగపుత్రులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మిషన్ కాకతీయ పథకం ద్వారా రాష్ట్రంలో చెరువులన్నీ జలకళను సంతరించుకున్నాయని దీంతో చెరువులపై ఆధారపడ్డ రైతులు, గంగపుత్రులు సంతోషంగా ఉన్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అశోక్‌పటేల్, జడ్పీటీసీ భారతిరాజు, సొసైటీ చైర్మన్ బాలాజీ, టీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## సమాజసేవలో స్వచ్ఛంద సంస్థలు, పారిశ్రామిక వర్గాలు ముందుండాలి..!!

### - జిల్లా కలెక్టర్ హనుమంతరావు.

సంగారెడ్డి, సెప్టెంబర్ 17 (నేటినిజం ప్రతినిధి) శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మెస్సర్స్ పార్కర్ హన్నిఫిన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వారి సహకారంతో మేడ్వాన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని నాలుగు పాఠశాలల్లో అమలు చేయనున్న మోడల్ స్కూల్ ప్రాజెక్ట్ ను జిల్లా కలెక్టర్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలల పై ప్రత్యేక దృష్టి సారించి, అన్ని మౌలిక వసతులను కల్పించడంతోపాటు పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తుందన్నారు.

పిల్లల ఆలోచనలకు అనుగుణంగా బోధన జరగాలన్నారు. పిల్లలను అభివృద్ధి చేసే అంశాలను గుర్తించాలన్నారు. వారి అభిరుచి మేరకు ఆ రంగాల్లో రాణించే విధంగా తల్లిదండ్రులు టీచర్లు పనిచేయాలని సూచించారు.

కార్పోరేట్ విద్యా సంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలతో టెక్నాలజీ వినియోగించుకుంటూ విద్యార్థులు చదువుకునేలా తీర్చిదిద్దాలన్నారు.

జిల్లాలోని ఆరుట్ల, పోచారం ఐనోల్ రామేశ్వరం బండ పాఠశాలల్లో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు, డిజిటల్ ఎడ్యుకేషన్ కు అవసరమైన సామాగ్రిని అందిస్తున్న పార్కర్ హన్నీఫిన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యాన్ని, మెడ్వాన్ ప్రతినిధులను ఆయన అభినందించారు. పాఠశాలలతో పాటు అంగన్వాడీ కేంద్రాలను దత్తత తీసుకుని అభివృద్ధి చేయాలని కోరారు. ఈ విధమైన సేవలతో





జిల్లాకు మంచి పేరు లభిస్తుందని అదేవిధంగా విద్యార్థులకు దిశానిర్దేశం చేసిన వారవుతారని ఆయన పేర్కొన్నారు.

మోడల్ స్కూల్ ప్రాజెక్ట్ లో భాగంగా ఆయా పాఠశాలల్లో 1 నుండి 8వ తరగతి వరకు అన్ని సబ్జెక్టులకు సంబంధించి విద్యార్థులకు సునాయసంగా అర్థమయ్యేలా ప్రొజెక్టర్ ద్వారా బోధిస్తారని మెడ్వాన్ సంస్థ అధ్యక్షులు మోహన్ రావు తెలిపారు. జాయ్ ఫుల్ లర్నింగ్ కిట్స్ తో ప్రైమరీ స్కూల్ స్థాయి పిల్లలు చదువుకుంటారని తెలిపారు. నాలుగు పాఠశాలలో హ్యాండ్ వాష్ ఏర్పాట్లు, మరుగుదొడ్ల మరమ్మతులు, కొత్త టాయిలెట్స్ నిర్మాణము, పాఠశాల భవనానికి పెయింటింగ్ తదితర పనులు చేపట్టడంతో పాటు, పాఠశాలలో లో టీచర్లు తక్కువగా ఉన్నచోట ఒక్కో టీచర్ ను ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సంబంధిత నాలుగు పాఠశాలకు ఒక్కొక్క ప్రొజెక్టర్, మూడు చొప్పున జాయ్ ఫుల్ లెర్నింగ్ కిట్స్, ప్రతి విద్యార్థికి టై, బెల్ట్ షూస్ ,సాక్స్, బుక్స్, బ్యాగ్స్ ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. ఆయా గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రానికి ఒక జాయ్ ఫుల్ లార్నింగ్ కిట్ను అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజర్షి షా, జిల్లా విద్యాశాఖ అధికారి రాజేష్, స్త్రీ,శిశు సంక్షేమ శాఖ అధికారి పద్మావతి, పార్కర్ కంపెనీ జనరల్ మేనేజర్ శ్రీరామ్ వెంకట్ రామన్, మెడ్వాన్ సంస్థ సెక్రెటరీ మధుసూదన్ రెడ్డి, సి డి పి ఓ లు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఆయా గ్రామాల సర్పంచులు పంచాయతీ సెక్రటరీలు, తదితరులు పాల్గొన్నారు.

## సఫ్దర్‌జంగ్ ఆస్పత్రి లో బహుళ ఆరోగ్య సదుపాయాలను ప్రారంభించిన కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ మన్‌సుఖ్ మాండవీయ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17:కేంద్ర ఆరోగ్య,కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ మన్‌సుఖ్ మాండవీయ, ఈరోజు న్యూఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ ఆస్పత్రిలో పేషెంట్ కేంద్రిత పలు సదుపాయాలను ప్రారంభించారు. అకృత్యాలనుంచి బాలల రక్షణ కేంద్రాన్నిఆస్పత్రి నూతన బ్లాక్‌లో ఆవిష్కరించారు. అలాగే పిఎం కేర్స్ నిధులతో ఏర్పాటైన మూడవ అ ఎం.టి ప్రెజర్ స్వింగ్ అడ్‌సార్ప్షన్ ఆక్సిజన్ ప్లాంట్‌ను, అదే ప్రాంగణంలో తాత్కాలిక ఆస్పత్రి సదుపాయాన్ని మంత్రి ప్రారంభించారు. క్వాలిటీకి బాత్ పేరుతో ఒక పుస్తకాన్ని కేంద్ర మంత్రి ఆవిష్కరించారు. అలాగే ఎన్.ఎ.బి.హెచ్ ఎంట్రీ స్థాయి సర్టిఫికేట్‌ను ఆయన అందజేశారు.

ఆస్పత్రి వర్గాలను అభినందిస్తూ మంత్రి శ్రీ మాండవీయ, వైద్యుల నిబ్ధత ,చిత్తశుద్ధి ఆరోగ్యరంగానికి కీలక స్థంబాల వంటివని అన్నారు. ఇది కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి పునాది అన్నారు. ఆస్పత్రులు, వైద్యులు నాణేనికి రెండువైపుల వంటి వారని అంటూ

కేంద్ర మంత్రి , ఒకరు లేకుండా మరొకరు లేరని అన్నారు. డాక్టర్లు తమ అకుంఠిత దీక్ష, పనిపై దృష్టితో దీనిని గమనించకపోవచ్చుని కానీ సమాజంలో వైద్యులకు అద్భుత గౌరవం ఉందని అన్నారు. కరోనా బారినుంచి రక్షించడంలో వైద్యుల చిత్తశుద్ధి వారిపట్ల గౌరవాన్ని మరింత పెంపొందింప చేసిందని ఆయన అన్నారు. ఆస్పత్రి అనేది ఈ విలువలకు సహజసిద్ధమైన కొనసాగింపు వంటిదని శ్రీ మాండవీయ అన్నారు.

కొద్దిరోజుల క్రితం తాను ఆకస్మికంగా ఆస్పత్రిని సందర్శించిన విషయాన్ని గుర్తు చేస్తూ ఆస్పత్రికి వచ్చే పేషెంట్లు వారి బంధువులపై భారాన్ని తగ్గించేందుకు అవకాశం ఉందని అన్నారు.ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి దార్శనికత అయిన నవ భారతావని ఆకాంక్షలకు అనుగుణంగా వ్యవస్థలో సంస్కరణలతో ఇది ముడిపడి ఉందని ఆయన అన్నారు. ఈ ఆస్పత్రిని దేశానికే నమూనా ఆస్పత్రిగా తీర్చిదిద్దాల్సిందిగా సిబ్బందికి సూచిస్తూ మంత్రి , వైద్యులు , వ్యక్తుల దృష్టిలోనుంచి కాక మొత్తం ఆస్పత్రి ఒక బృందంగ పనిచేయడంపై దృష్టిపెట్టాలని అన్నారు. అప్పుడు ఆస్పత్రి కార్యకలాపాలు నిరంతరాయంగా కొనసాగడానికి వీలు కలుగుతుందని అన్నారు. ఆస్పత్రి ప్రతిష్ఠను మరింత పెంచేందుకు ఇది ఉపకరిస్తుందని అయన అన్నారు.

యువ వైద్యులను ప్రోత్సహించేందుకు , మంత్రి ప్రధానమంత్రి నరేంద్రమోదీ గతంలో గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వారితో పనిచేసిన అనుభవాల గురించి మంత్రి వివరించారు. ప్రధానమంత్రి గారి కర్మయోగి సిద్ధాంతం ప్రభుత్వ అధికారులను, ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు, ఆరోగ్యరంగంలోని వారు మరింత ఉత్సాహంతో మెరుగ్గా పనిచేయడానికి ప్రేరణగా నిలిచిందని, ఇది వ్యవస్థ మెరుగుపడడానికి, ప్రవర్తనలోమార్పును సంస్థాగతం చేసి మొత్తం వ్యవస్థలో మార్పు తీసుకురావడానికి ఉపకరించిందని అన్నారు.

కేంద్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి శ్రీ రాజేష్ భూషణ్, కేంద్ర ఆరోగ్య సర్వీసుల డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ సునీల్ కుమార్ , సఫ్దర్‌జంగ్ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ ఎస్.వి.ఆర్య మంత్రి వెంట ఉన్నారు.

## సంసద్ టీవీని కలసి ప్రారంభించిన ఉప రాష్ట్రపతి, ప్రధాన మంత్రి, లోక్‌సభ స్పీకర్‌లు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17:ఈ రోజు న ప్రజాస్వామ్యం తాలూకు అంతర్జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకొని సంసద్ టీవీ ని ఉప రాష్ట్రపతి మరియు రాజ్య సభ చైర్ మన్ శ్రీ ఎం. వెంకయ్య నాయుడు, ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ, లోక్ సభ స్పీకర్ శ్రీ ఓమ్ బిర్లా లు ముగ్గురూ కలసి ప్రారంభించారు.

ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రధాన మంత్రి ప్రసంగిస్తూ పార్లమెంటు తో ముడిపడిన చానల్ లో, శరవేగం గా మారిపోతున్న కాలం తో పాటే మార్పు చోటు చేసుకోవడాన్ని ప్రశంసించారు. చర్చ లు- సంభాషణ ల మాధ్యమం ద్వారా 21వ శతాబ్దం ఒక క్రాంతి ని తీసుకు వస్తూ ఉంటే ఈ పరిణామం మరింత ప్రాముఖ్యాన్ని సంతరించుకొంటుందని ఆయన అన్నారు. సంసద్ టీవీ ప్రారంభాన్ని భారతదేశ ప్రజాస్వామ్యం చరిత్ర తాలూకు కథ లో ఒక కొత్త అధ్యాయం గా ప్రధాన మంత్రి అభివర్ణించారు. ఎందుకంటే సంసద్ టీవీ రూపం లో దేశాని కి చర్చలు, సంభాషణ అనే ఒక మాధ్యమం లభిస్తోందని, అది ప్రజాస్వామ్యానికి, ప్రజల ప్రతినిధుల కు ఒక కొత్త గొంతుక గా అయిపోతుంది అని ఆయన వివరించారు. దూరదర్శన్ ఏర్పాటై 62 సంవత్సరాలు పూర్తి చేసుకొన్నందుకు ప్రధాన మంత్రి శుభాకాంక్షల ను తెలిపారు. ఈ రోజు న ఇంజినీర్స్ డే కూడా కావడం తో, ఇంజినీర్ లు అందరికి ప్రధాన మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఈ రోజు న ప్రజాస్వామ్యం యొక్క అంతర్జాతీయ దినం కూడా అని ప్రధాన మంత్రి గుర్తు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని గురించి మాట్లాడుకొంటూ ఉన్నప్పుడు భారతదేశం బాధ్యత మరింత గా పెరిగిపోతుంది, ఎందుకంటే భారతదేశం ప్రజాస్వామ్యాని కి జనని గా ఉంది అన్నారు.

భారతదేశాని కి ప్రజాస్వామ్యం కేవలం ఒక వ్యవస్థ మాత్రమే కాదు, అది ఒక చైతన్యం కూడాను అని ఆయన అన్నారు. భారతదేశం లో ప్రజాస్వామ్యం రాజ్యాంగ సౌధం మాత్రమే కాదు, అది ఒక స్ఫూర్తి కూడా అని ప్రధాన మంత్రి అన్నారు. భారతదేశం లో ప్రజాస్వామ్యం ఓ రాజ్యాంగ ధార ల కలయిక మాత్రమే కాక ప్రజాస్వామ్యం మన జీవన వాహిని అని ఆయన అన్నారు.స్వాతంత్ర్యానికి 75వ సంవత్సరం వచ్చిన సందర్భం లో ప్రసార మాధ్యమాల భూమిక ను గురించి ప్రధాన మంత్రి నొక్కి చెప్పారు. గడచిపోయిన కాలం తాలూకు గౌరవం తో పాటు భవిష్యత్తు పట్ల భరోసా.. ఈ రెండూ కూడా ఇప్పుడు మన కళ్లెదుట ఉన్నాయన్నారు.

ప్రసార మాధ్యమాలు 'స్వచ్ఛ్ భారత్ అభియాన్' వంటి అంశాల ను ప్రస్తావించినప్పుడు అవి ప్రజల చెంతకు అమిత వేగం గా చేరుకొంటున్నాయి అని ఆయన గుర్తు చేశారు. ప్రసార మాధ్యమాలు స్వాతంత్ర్య పోరాటం పై 75 భాగాల ప్రణాళిక ను రూపొందించి ఈ సందర్భం లో ఒక ప్రత్యేక అనుబంధాన్ని తీసుకు వచ్చి 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్' వేళ లో ప్రజల ప్రయాసల ను వివరించడం లో ఒక పాత్ర ను పోషించవచ్చుంటూ ఆయన ఒక సూచన ను చేశారు. కంటెంట్ ప్రాముఖ్యాన్ని గురించి ప్రధాన మంత్రి చెప్తూ, కంటెంట్ ఇజ్ కింగ్ అని అంటూ ఉంటారు, అయితే తన అనుభవం లో 'కంటెంట్ ఇజ్ కనెక్ట్' అని పేర్కొన్నారు. దీనిని గురించి ఆయన విడమరచి చెప్తూ, ఎప్పుడయితే ఎవరి దగ్గర అయినా ఉత్తమమైన కంటెంట్ ఉంటుందో, అప్పుడు ప్రజలు స్వతహా గా వారితో ముడిపడిపోతారు. ఈ విషయం ప్రసార మాధ్యమాల పరం గా ఎంత గా వర్తిస్తుందో, అంతగా మన పార్లమెంటరీ వ్యవస్థ కు కూడాను వర్తిస్తుంది, ఎందుకంటే పార్లమెంట్ ఉభయ సభల లో ఒక్క రాజకీయాలే ఉండవు, అక్కడ విధానాలు కూడా రూపాన్ని పోసుకొంటాయి అన్నారు. సాధారణ ప్రజానీకం పార్లమెంటు కార్యకలాపాల తో మమేకం అయిపోవాలి అని ఆయన స్పష్టం చేశారు. ఈ దిశ లో కృషి చేయాలి అని కొత్త చానల్ కు ఆయన సూచించారు.

పార్లమెంటు సమావేశాలు జరుగుతూ ఉన్నప్పుడు, విభిన్న అంశాల పైన చర్చ లు సాగుతూ ఉంటాయని, వాటి లో యువత కు నేర్చుకొనేందుకు ఎంతో ఉంటుందని ప్రధాన మంత్రి అన్నారు. మన గౌరవనీయ పార్లమెంట్ సభ్యుల కు కూడా వారి ని దేశ ప్రజలు చూస్తూ ఉన్నారన్న విషయం అప్పుడు తెలుస్తుంది, అలాంటప్పుడు పార్లమెంట్ లోపల ఉత్తమమైన పద్ధతి లో నడుచుకోవడానికి, ఉత్తమమైన విధం గా చర్చించడానికి ప్రేరణ లభిస్తుంది అని ఆయన అన్నారు. పౌరులు సైతం వారి కర్తవ్యాల పైన దృష్టి ని సారించవలసిన అవసరాన్ని గురించి ప్రధాన మంత్రి నొక్కి పలికారు. ఈ దిశ లో అవగాహన ను కల్పించడం లో ప్రసార మాధ్యమాలు ఒక ప్రభావ శీల మాధ్యమం అని ప్రధాన మంత్రి అన్నారు. ఈ కార్యక్రమాల ద్వారా, మన యువత కు మన ప్రజాస్వామ్య సంస్థలు, వాటి పనితీరు తో పాటు పౌరుల బాధ్యతల ను గురించి ఎంతో నేర్చుకునే అవకాశం ఉంటుంది అని ఆయన అన్నారు. అదేవిధం గా, సభాసంఘాలు, సభా కార్యకలాపాల ప్రాముఖ్యం మరియు చట్టసభ ల కార్యాలను గురించిన తగినంత సమాచారం అందుతుందని, దీనితో భారతదేశం లోని ప్రజాస్వామ్యాన్ని బాగా అర్థం చేసుకోవడం లో తోడ్పాటు లభిస్తుందని ప్రధాన మంత్రి అన్నారు.

# గిరిజన, దళిత అభివృద్ధికి ప్రభుత్వం కృషి

## -ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్



నిర్మల్, సెప్టెంబర్ 16: దళిత, గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో సమావేశ మందిరంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 39 మందికి 50వేల రూపాయల చొప్పున రూ. 41 లక్షల చెక్కులను, కల్యాణ లక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రజల కష్టాలను తీర్చేందుకు అన్ని విధాల కృషి చేస్తుందన్నారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా అపుడే పుట్టిన బిడ్డ నుంచి వృద్ధుల వరకు అనేక పథకాలు అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు.

కార్యక్రమంలో ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు, వైస్ ఎంపీపీ బాలాజీ, ఎంపీడీవో తిరుమల, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్, టీఆర్ఎస్ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# రైతుల పాలిట దేవుడిలా సీఎం కేసీఆర్

మునిపల్లి, సెప్టెంబర్ 17:: సీఎం కేసీఆర్‌తోనే రాష్ట్రంలోని రైతులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నారని టీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సాయికుమార్, అల్లం నవాజ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన మునిపల్లిలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి వారు క్షీరాభిషేకం చేశారు.

అనంతరం మాట్లాడుతూ రైతుల పాలిట దేవుడిగా సీఎం కేసీఆర్ నిలిశారని కొనియాడారు. సంగమేశ్వర ఎత్తిపోతల పథకానికి ప్రభుత్వం పరిపాలన అనుమతులు ఇవ్వడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు రమేశ్, వీరన్నాపాటిల్, విశ్వనథంపాటిల్, ఎంపీటీసీ రాజశేఖర్, మాజీ ఎంపీపీ చంద్రయ్య, నాయకులు , వెంకట్‌రాములు, నారాయణ, భాస్కర్, నర్సింలు, గరిబొద్దిన్, మల్లేశం, నవీన్, పరశురాం, మోహన్ తదితరులు ఉన్నారు.

# గ్రామాల్లో వంద శాతం కొవిడ్ వ్యాక్సిన్ వేయించాలి

## -ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

ఆదిలాబాద్, సెప్టెంబర్ 17:గ్రామాల్లో వందశాతం కొవిడ్ వ్యాక్సిన్ వేయించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. శుక్రవారం తాంసి మండలంలోని పొన్నారి గ్రామంలో నిర్వహించిన మెగా వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ వ్యాక్సిన్ వేయించుకునేలా వారిని ప్రోత్సహించాలని సూచించారు. వ్యాక్సినేషన్ కోసం పెద్ద సంఖ్యలో ప్రజలు తరలిరావడం అభినందనీయమని పేర్కొన్నారు. వ్యాక్సిన్ తీసుకున్నవారు రెండవడోస్ ఎప్పుడు తీసుకోవాలో ప్రజలకు తెలియజేయాలని సూచించారు. ఏవైనా సలహాలు, సూచనలు అవసరమైతే ఫోన్ చేసేందుకు హెల్ప్ డెస్క్‌కు, లేదా టోల్ ఫ్రీ నంబర్‌ను పంచాయతీ కార్యాలయంలో అందుబాటులో ఉంచాలన్నారు.

వ్యాక్సిన్ తీసుకున్నవారు వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. అనంతరం గ్రామ పంచాయతీ ఆవరణలో మొక్కలు నాటి, ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. తరగతి గదులను పరిశీలించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. అనంతరం అంగన్‌వాడీ సెంటర్‌లో మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నామని సిబ్బంది కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ కిషన్, డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ నరేందర్‌రాథోడ్, జిల్లా పౌరసరఫరాల అధికారి సుదర్శన్, అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ సాధన, ఎంపీడీవో రవీందర్, ఏపీఎం రవీందర్, సర్పంచ్ సంజీవ్‌రెడ్డి, ఎంపీటీసీ రేఖ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీవారి బ్రహ్మోత్సవాలు ఏకాంతం: టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి

తిరుపతి,సెప్టెంబర్ 16: తిరుమల తిరుపతిలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు ఏకాంతంగా జరుపుతామని టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ప్రకటన చేశారు. రోనా సెకండ్ వేవ్ పూర్తిస్థాయిలో అదుపులోకి రానేలేదు.. మరోవైపు కరోనా థర్డ్ వేవ్ హెచ్చరికలు కలవరపెడుతున్నాయి.. థర్డ్ వేవ్‌పై రకరకాల అంచనాలున్నాయి.. అయితే.. కరోనా థర్డ్ వేవ్ హెచ్చరికలు కారణంగా శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఏకాంతమగానే నిర్వహించాలని నిర్ణయించింది టీటీడీ. ఏపీ వ్యాప్తంగా కరోనా విజృంభణ కొనసాగుతోన్న విషయం తెలిసిందే. అలాగే, మూడో దశ కరోనా హెచ్చరికల నేపథ్యంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలపై ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. అక్టోబరు 7 నుంచి అదే నెల 15 వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామని వైవీ సుబ్బారెడ్డి వివరించారు.

ఈ ఏడాదీ కూడా బ్రహ్మోత్సవాలు ఆలయానికే పరిమితమవుతాయని చెప్పారు. వాహన సేవలన్నీ ఆలయప్రాకారానికి పరిమితమవుతాయని వివరించారు. కాగా, గత ఏడాది కూడా శ్రీవారిని బ్రహ్మోత్సవాలు ఏకాంతంగానే నిర్వహించిన విషయం తెలిసిందే. ఇక, మరో వారంరోజులలో ఆన్‌లైన్‌లో సర్వదర్శన టోకెన్ల జారీని ప్రారంభిస్తామన్న ఆయన.. మరోవైపు.. అన్నమయ్య కీర్తనలకు బహుళ ప్రచారం కల్పిస్తాం అన్నారు.. అన్నమయ్య కీర్తనలు అన్నింటికి ప్రాచుర్యం కల్పించడానికి అదివో అల్లదివో పాటల పోటీ కార్యక్రమాని ప్రారంభిస్తున్నామని తెలిపారు.. 15 నుంచి 25 సంవత్సరాల వయ్సుసు కలిగినవారు ఈ పాటల పోటీల్లో పాల్గొనవచ్చన్న ఆయన.. జిల్లా స్థాయిలో ప్రారంభించి రాష్ట్ర స్థాయిలో కూడా ఈ పోటీ కార్యక్రమం నిర్వహిస్తామని ప్రకటించారు టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి.

# కస్తూర్‌బా గాంధీ మార్గ్‌లోను, ఆఫ్రికా ఎవిన్యూలోను డిఫెన్స్ ఆఫీసెస్ కాంప్లెక్సెస్‌ను ప్రారంభించిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17:న్యూ ఢిల్లీ లోని కస్తూర్ బా గాంధీ మార్గ్, ఆఫ్రికా ఎవిన్యూలలో నిర్మాణం జరిగిన డిఫెన్స్ ఆఫీసెస్ కాంప్లెక్స్ లను ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఆఫ్రికా ఎవిన్యూ లో రక్షణ శాఖ కార్యాలయ భవన సముదాయాన్ని ఆయన సందర్శించి, సైన్యం, నౌకాదళం, వాయు సేన ల అధికారుల తో, సివిలియన్ ఆఫీసర్స్ తో సంభాషించారు కూడా.

సమూహాన్ని ఉద్దేశించి ప్రధాన మంత్రి ప్రసంగిస్తూ, ఈ రోజు న భవన సముదాయాల ను ప్రారంభించుకోవడం ద్వారా భారతదేశం తన దేశ రాజధాని నగరాన్ని ఒక 'న్యూ ఇండియా' యొక్క అవసరాల కు, ఆకాంక్షల కు తగినట్లుగా అభివృద్ధి పరచుకోవడం లో భారత స్వాతంత్ర్యపు 75వ సంవత్సరం లో మరొక అడుగు ను వేసిందని పేర్కొన్నారు. చాలా కాలం పాటు రక్షణ కు సంబంధించిన పనుల ను రెండో ప్రపంచ యుద్ధం కాలం లో నిర్మించిన తాత్కాలిక నివాసాల నుంచే నిర్వహిస్తూ వచ్చిన వాస్తవం పట్ల విచారాన్ని వ్యక్తం చేశారు. గుర్రపుసాల లను, సేనాశిబిరాల ను దృష్టి లో పెట్టుకొని నిర్మించిన తాత్కాలిక నివాసాలు అవి అని కూడా ఆయన అన్నారు. "ఈ కొత్త రక్షణ శాఖ కార్యాలయ భవన సముదాయాలు మన రక్షణ బలగాల పనితీరు ను మరింత సౌకర్యవంతమైందిగాను, ప్రభావవంతమైంది గాను తీర్చిదిద్దే ప్రయాసల ను పటిష్టపరుస్తాయి" అని ఆయన చెప్పారు.

కె.జి మార్గ్ లో, ఆఫ్రికా ఎవిన్యూ లో నిర్మాణం జరిగిన ఆధునిక కార్యాలయాలు దేశ ప్రజల భద్రత కు సంబంధించిన అన్ని పనుల ను ప్రభావశీలమైన రీతి లో పూర్తి చేయడం లో ఎంతగానో తోడ్పడుతాయని ప్రధాన మంత్రి అన్నారు. ఇది దేశ రాజధాని లో ఒక ఆధునికమైన డిఫెన్స్ ఎన్ క్లేవ్ ను నిర్మించే దిశ లో ఒక ప్రధానమైన చర్య అని ఆయన చెప్పారు. ఈ భవన సముదాయాల ను భారతదేశ కళాకారుల ఆకర్షణీయమైన కళా కృతుల హంగుల తో ను దిద్ది తీర్చడం ఎంతో బాగుంది అని ఆయన అన్నారు. "ఈ భవన సముదాయాలు దిల్లీ మరియు పర్యావరణ సంబంధిత ఔన్నత్యాన్ని పరిరక్షిస్తూనే మన సంస్కృతి తాలూకు వైవిధ్యాన్ని ఒక ఆధునిక రూపం లో సాక్షాత్కరింప చేస్తున్నాయి" అని ఆయన అన్నారు.మనం రాజధాని ని గురించి మాట్లాడుకున్నప్పుడు అది కేవలం ఒక నగరమే కాదు అని ప్రధాన మంత్రి వ్యాఖ్యానించారు. ఏ దేశ రాజధాని నగరం అయినా, ఆ దేశం ఆలోచన విధానాని కి, ఆ దేశం దృఢ నిశ్చయాని కి, ఆ దేశం బలాని కి, ఇంకా ఆ దేశం సంస్కృతి కి ఒక చిహ్నం గా ఉంటుంది. భారతదేశం ప్రజాస్వామ్యాని కి జనని గా ఉంది. అందువల్ల భారతదేశం యొక్క రాజధాని ఎలా ఉండాలి అంటే అందులో పౌరుల కు, ప్రజల కు కేంద్ర స్థానం దక్కాలి అని ప్రధాన మంత్రి అన్నారు.

'ఈజ్ ఆఫ్ లివింగ్', 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' లపై ప్రభుత్వం తీసుకొంటున్న శ్రద్ధ లో ఆధునిక మౌలిక సదుపాయాల తాలూకు భూమిక ను గురించి ప్రధాన మంత్రి నొక్కి చెప్పారు. "సెంట్రల్ విస్టా లో ప్రస్తుతం జరుగుతున్న నిర్మాణ పనులు ఇదే ఆలోచన తో సాగుతున్నాయి" అని ప్రధాన మంత్రి అన్నారు. నూతన నిర్మాణాల తాలూకు ప్రయత్నాలు రాజధాని ఆకాంక్షల కు అనుగుణం గా ఉన్నాయని ప్రధాన మంత్రి చెప్తూ, ప్రజా ప్రతినిధుల నివాసాలు, బాబా సాహెబ్ ఆమ్బేడ్ కర్ స్మృతుల ను పరిరక్షించేందుకు జరుగుతున్న ప్రయత్నాలు, మన అమరవీరుల కోసం ఉద్దేశించిన అనేక భవనాలు, స్మారకాలు ప్రస్తుతం దేశ రాజధాని కీర్తి ని ఇనుమడింప చేస్తున్నాయని ఆయన వివరించారు.

డిఫెన్స్ ఆఫీస్ కాంప్లెక్స్ పనుల ను 24 నెలల లో పూర్తి చేయవలసి ఉండగా, 12 మాసాల లోనే వాటిని పూర్తి చేయడం ఒక రికార్డు అని ప్రధాన మంత్రి అన్నారు. మళ్ళీ అందులోను శ్రామికుల కు సంబంధించిన సవాళ్ల తో సహా అనేక ఇతర సవాళ్ళు కరోనా సృష్టించిన స్థితిగతుల వల్ల తలెత్తాయి అని ఆయన గుర్తు చేశారు. కరోనా కాలం లో వందల కొద్దీ శ్రామికుల కు ఈ ప్రాజెక్టు లో పని దొరికింది. దీని తాలూకు ఖ్యాతి ప్రభుత్వం పని చేసే తీరు లో, ప్రభుత్వం ఆలోచన విధానం లో వచ్చిన మార్పు దే అని ఆయన అన్నారు. "విధానాలు, ఉద్దేశ్యాలు స్పష్టం గా ఉన్నప్పుడు, సంకల్ప శక్తి బలం గా ఉన్నప్పుడు, కృషి లో నిజాయతీ ఉన్నప్పుడు ప్రతిదీ సాధ్యపడుతుంది" అని ప్రధాన మంత్రి అన్నారు. ఈ డిఫెన్స్ ఆఫీస్ కాంప్లెక్స్ లు మారుతున్న పని సంస్కృతి ని, ప్రభుత్వం యొక్క ప్రాథమ్యాల లో మార్పు ను చాటి చెప్తున్నాయి అని ప్రధాన మంత్రి అన్నారు. ప్రభుత్వం లో వివిధ విభాగాల పరం గా అందుబాటులో ఉన్న భూమి ని సరైన రీతి లో గరిష్ఠ స్థాయి లో వినియోగించుకోవడం అనేది ఆ తరహా ప్రాథమ్యాల లో ఒకటి గా ఉంది అని ఆయన అన్నారు. ఈ డిఫెన్స్ ఆఫీస్ కాంప్లెక్స్ లను ఇదే విధమైన భవన సముదాయాల కు మునుపటి కాలాల్లో వలె అయిదు రెట్ల అధిక భూమి ని వినియోగించడం కాకుండా 13 ఎకరాల జాగా లో మాత్రమే నిర్మించడం జరిగిందని ప్రధాన మంత్రి వివరించారు. రాబోయే 25 సంవత్సరాల లో అంటే, 'ఆజాదీ కా అమృత్ కాల్' లో, ప్రభుత్వ వ్యవస్థ తాలూకు సామర్థ్యాన్ని ఈ విధమైన ప్రయాసల తో పరిపుష్టం చేయడం జరుగుతుంది అని కూడా ప్రధాన మంత్రి ప్రముఖం గా ప్రకటించారు. ఒక ఉమ్మడి కేంద్ర సచివాలయం అందుబాటు లోకి రావడం, సమావేశ మందిరం దానికి జత పడటం, మెట్రో వంటి సులభమైన సంధాన సదుపాయం రాజధాని నగరాన్ని ప్రజల కు అనుకూలమైంది గా మలచడం లో ఎంతగానో దోహదపడతాయని చెప్తూ ప్రధాన మంత్రి తన ప్రసంగాన్ని ముగించారు.

# ఆ పథకాలతో గిరిజనులకు జీవితాల్లో వెలుగులు



అమరావతి, సెప్టెంబర్ 17:వామపక్ష తీవ్రవాదంపై కేంద్ర హోంశాఖ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వంలోని పలు శాఖలు, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సెప్టెంబరు 26న సమావేశం నిర్వహించనుంది. ఈ నేపథ్యంలో హోం, గిరిజన సంక్షేమంతో పాటు వివిధ శాఖల అధికారులతో సీఎం జగన్ సమావేశం నిర్వహించారు. ఢిల్లీలో కేంద్ర హోంశాఖ సమావేశంలో ప్రస్తావించనున్న అంశాలపై చర్చించారు. గిరిజన ప్రాంతాల్లో రోడ్లు, పాఠశాలలు, ఇతర మౌలిక వసతుల కల్పన విషయంలో కేంద్రం దృష్టికి తీసుకెళ్లాల్సిన అంశాలపై చర్చ జరిపారు.

రాష్ట్రంలో మావోయిస్టుల కార్యకలాపాలు, తదితర అంశాలను సమావేశంలో డీజీపీ వివరించారు. మావోయిస్టుల కార్యకలాపాలు గణనీయంగా తగ్గాయని డీజీపీ తెలిపారు. సాయుధ మావోయిస్టుల బలం సుమారు 50కి పరిమితమైందన్నారు. ప్రస్తుతం శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలకే పరిమితమైందని డీజీపీ తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న అనేక సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు గిరిజనుల జీవితాలపై విశేష ప్రభావం చూపుతున్నాయన్నారు. గ్రామ సచివాలయాలు, వాలంటీర్ల ద్వారా వారి గడప వద్దకే సేవలు అందుతున్నాయన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు అతిపెద్ద కార్యక్రమమని, దీనిపట్ల గిరిజనులు సంతోషంగా ఉన్నారని డీజీపీ వెల్లడించారు. మావోయిస్టుల రిక్రూట్‌మెంట్ పట్ల గిరిజన యువకులు ఆసక్తి చూపడం లేదన్నారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలే దీనికి ప్రధాన కారణమని డీజీపీ చెప్పారు.

ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూలేని విధంగా గిరిజనులకు ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు ఇచ్చామన్నారు. అంతేకాదు ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు ఉన్న గిరిజన రైతులకు రైతు భరోసా కూడా ఇస్తున్నాం అని తెలిపారు. ప్రతి ఏటా రూ.13,500 గిరిజన రైతుల చేతిలో పెడుతున్నామన్న సీఎం..ఆ భూముల్లో బోర్లు వేసి, పంటల సాగుకోసం కార్యాచరణకూడా రూపొందించామని చెప్పారు. దీన్ని అమలు చేసుకుంటూ ముందుకు వెళ్తామన్నారు. ఆసరా, చేయూత, అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన తదితర పథకాలతో గిరిజనులకు జీవితాల్లో వెలుగులు నింపుతున్నామని పేర్కొన్నారు. 31,155 ఎకరాల డీకేటీ పట్టాలను 19,919 మంది గిరిజనులకు ఇచ్చామని వివరించారు. గ్రామ సచివాలయాల్లో ఉద్యోగాలు ఇచ్చామని, వాలంటీర్లగా వారిని నియమించామని గుర్తు చేశారు. తద్వారా పెద్ద సంఖ్యలో గిరిజనులకు ఉద్యోగాల కల్పన జరిగిందన్నారు. వారి గ్రామాల్లోనే వారికి ఉద్యోగాలు ఇచ్చినట్లు చెప్పారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో ట్రైబల్ ప్రాంతాల్లో గిరిజనులకు పూర్తి రిజర్వేషన్ ఇచ్చామని సీఎం తెలిపారు. ఈ కార్యక్రమాలన్నీ కూడా గిరిజనుల జీవన ప్రమాణాలను కచ్చితంగా పెంచుతాయన్నారు. 36 షెడ్యూలు మండలాల్లో పాఠశాలలు, హాస్టళ్లను నాడు-నేడు కింద 10అంశాల ద్వారా మెరుగుపరుస్తున్నామన్నారు. నాడు ?-నేడు కార్యక్రమాలకు తగిన సహకారం అందించాల్సిందిగా కేంద్రాన్ని కోరాలని సీఎం సూచించారు.

అలాగే షెడ్యూలు ప్రాంతాల్లోని ఆస్పత్రుల్లో చేస్తున్న నాడు?నేడు కార్యక్రమాలకూ తగిన సహకారాలు అందించాలంటూ కేంద్రాన్ని కోరాల్సిందిగా అధికారులకు ఆదేశించారు. ట్రైబల్ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న టవర్ల మ్యాపింగ్ జాగ్రత్తగా చేయాలని సమావేశానికి హాజరైన టెలికాం అధికారులకు సీఎం ఆదేశించారు. దాదాపు 400 టవర్ల ద్వారా 900 గ్రామాలకు టెలికాం సౌకర్యం కల్పిస్తున్నామని అధికారులు వివరించారు. సమగ్రంగా ఇంటర్నెట్, మొబైల్ టెలికాం సౌకర్యం ఇచ్చేలా విధానం ఉండాలని సీఎం సూచించారు. దీనిపై ఒక ప్రణాళిక రూపొందించి, ఆమేరకు కేంద్రం సహకారం కోరాలన్నారు. ఒక్క గ్రామం కూడా మిగిలిపోకుండా అన్ని గిరిజన గ్రామాలకూ ఇంటర్నెట్, మొబైల్ సౌకర్యం కల్పించే దిశగా అడుగులేయాలని స్పష్టం చేశారు. గ్రామ సచివాలయాలు ఉన్న ప్రతిచోటా కూడా పోస్ట్ ఆఫీసు ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఆమేరకు మ్యాపింగ్ చేసుకుని, మిగిలిన పోస్ట్ ఆఫీసులు తెరిచేందుకు కేంద్ర ప్రభుత్వాన్ని కోరాలన్నారు. ట్రైబల్ యూనివర్శిటీని త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సీఎం చెప్పారు. గిరిజనుల్లో చాలామంది పిల్లలకు ఆధార్ లేదన్న అధికారులు తెలుపగా.. ట్రైబల్ ప్రాంతాల్లో అన్ని గ్రామ సచివాలయాలను ఆధార్ సెంటర్లుగా గుర్తించేలా కూడా కేంద్రాన్ని కోరాలని సీఎం జగన్ స్పష్టం చేశారు.

# మత్స్యకార్మికుల జీవితాల్లో వెలుగులు



బాన్సువాడ సెప్టెంబర్ 17: మత్స్య కార్మికుల కుటుంబాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర శాసనసభాపతి పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. నూటికి నూరు శాతం రాయితీపై మత్స్యకార్మికులకు చేప పిల్లలను అందిస్తున్న ఘనత తెలంగాణ ప్రభుత్వానికే దక్కుతుందని ఆయన కొనియాడారు. శుక్రవారం కామారెడ్డి జిల్లా కలెక్టర్ జితేష్ వీ పాటిల్‌తో కలిసి పట్టణంలోని కల్కి చెరువులో చేపపిల్లలను విడుదల చేశారు. అనంతరం కల్కిచెరువుపై మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో స్పీకర్ మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో ఏ ప్రభుత్వం, ఏ ముఖ్యమంత్రి మత్స్యకార్మికులకు ఇలాంటి కార్యక్రమాలు చేపట్టలేదని అన్నారు. నామ్ కే వాస్తేగా జిల్లాలో కొన్ని చెరువులకు 12 వేల 500 రూపాయల చొప్పున ఇచ్చేవారన్నారు.

తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని రిజర్వాయర్లు , చెరువులు , సాగునీటి వనరులలో రూ. 92 కోట్లతో 100 కోట్ల చేపపిల్లలను ప్రతి ఏటా విడుదల చేస్తుందని వెల్లడించారు. వీటి విలువ పదివేల కోట్ల రూపాయలుంటుందని పేర్కొన్నారు. కులవృత్తుల వారు గౌరవంగా బతకడానికి భారీ సబ్సిడీలతో పథకాలను అమలు చేస్తుందని అన్నారు. ప్రభుత్వం దళారీ వ్యవస్థను శాశ్వతంగా రూపుమాపుడానికి వందశాతం రాయితీ పై సమీకృత మత్స్య అభివృద్ధి పథకం ద్వారా చేప పిల్లలను పంపిణీ చేస్తుందని వివరించారు. బాన్సువాడ నియోజక వర్గంలో 27 లక్షల చేపపిల్లలను వివిధ చెరువుల్లో వేస్తున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ జితేష్ వీ పాటిల్ మాట్లాడుతూ చేప పిల్లలను విడుదల చేయడం ద్వారా మత్స్యకారుల కుటుంబాలు ఆర్థికాభివృద్ధిని సాధిస్తున్నాయని పేర్కొన్నారు.

కార్యక్రమంలో ఆర్డీవో రాజాగౌడ్, తాసీల్దార్ గంగాధర్, జిల్లా రైతు బంధు సమితి అధ్యక్షుడు డాక్టర్ అంజిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, వైస్ చైర్మన్ షేక్ జుబేర్, సొసైటీ అధ్యక్షుడు పిట్ల శ్రీధర్ , కౌన్సిలర్లు నందకిశోర్ , హాకీం, శ్రీనివాస్, కిరణ్ ,నాయకులు దొడ్ల వెంకట్రామ్ రెడ్డి, మహ్మద్ ఎజాస్, వాహబ్ , నార్ల ఉదయ్ గుప్తా తదితరులు ఉన్నారు.

# నేటి నుంచే చార్‌ధామ్ యాత్ర: ఉత్తరాఖండ్ సీఎం

డెహ్రాడూన్, సెప్టెంబర్ 17:: చార్‌ధామ్ యాత్రపై ఉన్న నిషేధాన్ని గురువారం ఉత్తరాఖండ్ హైకోర్టు ఎత్తివేసిన విషయం తెలిసిందే. కరోనా ఉధృతి నేపథ్యంలో ఆ యాత్రను రద్దు చేశారు. అయితే రేపటి నుంచే ఆ యాత్ర ప్రారంభం అవుతుందని ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కోవిడ్ నిబంధనలను కఠినంగా అమలు చేస్తూ తీర్థ యాత్రలను నిర్వహించవచ్చు అని కోర్టు పేర్కొన్నది. పుణ్యక్షేత్రాల దర్శనానికి రోజూ పరిమితి సంఖ్యలో భక్తులను అనుమతించాలని నిబంధన పెట్టింది. సందర్శకులకు కోవిడ్ నెగటివ్ రిపోర్ట్, వ్యాక్సినేషన్ ధ్రువపత్రాన్ని చూపాల్సిందేనని ధర్మాసనం స్పష్టం చేసింది. చార్‌ధామ్ భక్తులు యమునోత్రి, గంగోత్రి, కేదారీనాథ్, బద్రీనాథ్ క్షేత్రాలను దర్శించుకుంటారు.

# స్థానిక సంస్థల ఓట్ల లెక్కింపునకు హైకోర్టు అనుమతి

అమరావతి, సెప్టెంబర్ 17: ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు హై కోర్టు అనుమతి ఇచ్చింది. లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడించవచ్చని పేర్కొన్నది. ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఏకే గోస్వామి, జస్టిస్ జె ఉమాదేవితో కూడిన ధర్మాసనం తీర్పును వెలువరించింది. సింగిల్ జడ్జి ఉత్తర్వులను తోసిపుచ్చిన ధర్మాసనం.. ఎన్నికలను సమర్థించింది.

ఈ ఏడాది ఏప్రిల్ 1న ఎస్ఈసీ నోటిఫికేషన్ ఇచ్చారు. దీని ఆధారంగా గత ఏప్రిల్ 8న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎలక్షన్‌ను హైకోర్టు సింగిల్ జడ్జి మే 21న రద్దు చేస్తూ తీర్పు ఇచ్చిన విషయం విదితమే. సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలకు విరుద్ధంగా నోటిఫికేషన్ ఉందని పేర్కొన్నారు. అయితే హైకోర్టు ధర్మాసనం తాజాగా నోటిఫికేషన్ ఇవ్వాలని ఆదేశించింది.

సుప్రీం కోర్టు ఆదేశాలకు కట్టుబడి పోలింగ్ తేదీకి నాలుగు వారాల ముందు తిరిగి ఎన్నికల కోడ్ విధించాలని స్పష్టం చేశారు. సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ ఎన్నికల్లో పోటీ చేసిన కొందరు హైకోర్టులో అప్పీల్ చేశారు. వాటిపై ఆగస్టు 5న విచారణ జరిపిన ధర్మాసనం తీర్పును రిజర్వు చేసింది. తాజాగా ఓట్ల లెక్కింపునకు సమర్థిస్తూ ఈ రోజు తీర్పును వెలువరించింది.

# పేదల ఆత్మగౌరవం కాపాడటానికే 'డబుల్' ఇండ్లు : స్పీకర్ పోచారం



కామారెడ్డి, సెప్టెంబర్ 17:: పేదింటి ఆడబిడ్డల ఆత్మగౌరవం కాపాడటానికే డబుల్ బెడ్ రూం ఇండ్లు నిర్మిస్తున్నామని శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. నసరుల్లాబాద్ మండలం అంకోల్ క్యాంప్ వద్ద మేయిన్ రోడ్డు నుంచి హాజీపూర్ గ్రామం మధ్య ఉన్న రోడ్డును రూ. 6 కోట్లతో డబుల్ రోడ్డుగా నిర్మించే పనులకు శంకుస్థాపన చేశారు.

అదేవిధంగా అంకోల్ గ్రామంలో రూ.10 లక్షలతో నూతనంగా నిర్మించిన కురుమ సంఘం భవనం, మత్స్య సంఘం భవనాలను ప్రారంభించారు. అంకోల్ తండాలో నూతనంగా నిర్మించిన 30 డబుల్ బెడ్ రూం ఇండ్లను ప్రారంభించి మరో 15 ఇండ్లకు భూమి పూజ చేశారు. రూ. 18 లక్షలతో నిర్మించనున్న అదనపు తరగతి గదులకు శంకుస్థాపన చేశారు. గ్రామ పంచాయతీ నూతన భవనం నిర్మాణానికి రూ. 15 లక్షలు మంజూరు చేశారు.

ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ..అన్ని వసతులతో, 100 శాతం సబ్సిడీపై దేశంలో డబుల్ బెడ్ రూం ఇండ్లను మంజూరు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు. బాన్సువాడ నియోజకవర్గ పరిధిలో నాకు సొత ఇల్లు లేదు అనేవారు ఉండకూడదు అన్నదే నా ఆశయం అన్నారు.

రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి పక్కనున్న మహారాష్ట్రలోని పది గ్రామాల ప్రజలు తమను కూడా తెలంగాణ రాష్ట్రంలో కలపాలని కోరుతున్నారని స్పీకర్ తెలిపారు.

పేదలు, రైతుల కష్టాలు తెలిసిన మనసున్న మహరాజు సీఎం కేసీఆర్ అని ప్రశంసించారు. అందుకే రాష్ట్రంలో అనేర సంక్షేమ పథకాలతో పేదలను ఆదుకుంటున్నారని తెలిపారు.

# ప్రభుత్వ ఉద్యోగులు టీకా తీసుకోకపోతే జీతం కట్

హైదరాబాద్ , సెప్టెంబర్ 17:కరోనాను నియంత్రించడానికి వ్యాక్సిన్ తీసుకోవడమే మార్గమని ప్రపంచ వ్యాప్తంగా నిపుణులు అంటున్నారు. కానీ కొందరు కొన్ని భయాల కారణంగా వ్యాక్సిన్ తీసుకోవడానికి సంకోచిస్తున్నారు. ఇలాంటి వారు టీకా తీసుకునేలా చేయడానికి ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయి. ఈ క్రమంలోనే పుదుచ్చేరిలో కరోనా టీకా తీసుకోవడానికి ఇష్టపడని ప్రభుత్వ ఉద్యోగులకు లెఫ్టినెంట్ గవర్నర్ షాకిచ్చారు. వీరు గనుక టీకా తీసుకోలేదంటే జీతంతోపాటు దీపావళి బోనస్ కూడా ఇవ్వబోమని ప్రకటించారు. వ్యాక్సిన్ తీసుకున్న వారికే ఈ రెండూ లభిస్తాయని తెలిపారు.గురువారం నాడు కరోనా వ్యాక్సిన్‌పై అవగాహన కల్పిస్తూ భారత వాయుసేనకు చెందిన కొందరు అధికారులు సైకిల్ ర్యాలీ ప్రారంభించారు. టీకా ఆవశ్యకతను వివరించే ఈ ర్యాలీ ద్వారా అందరూ వ్యాక్సిన్ తీసుకోవాలని సైనికులు పిలుపునిచ్చారు. రాజ్ నివాస్ ఆవరణ నుంచి ఈ ర్యాలీ ప్రారంభమైంది. దీన్ని పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ తమిళి సై సౌందరరాజన్ జెండా ఊపి ఆరంభించారు. ఈ సందర్భంగానే టీకా తీసుకున్న వారికే జీతం, దీపావళి బోనస్ లభిస్తాయని ఆమె పేర్కొన్నారు.

# అసెంబ్లీ ఎన్నికల్లో అక్రమాలకు కాషాయ పార్టీ కుట్ర : అఖిలేష్ యాదవ్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17:దేశంలో అతిపెద్ద ఎన్నికలైన యూపీ అసెంబ్లీ ఎన్నికలు కీలకమైనవని, ఈవీఎంల పట్ల ఎస్పీ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ చీఫ్ అఖిలేష్ యాదవ్ అన్నారు. ఈసారి బీజేపీ పోలింగ్ బూత్‌ల్లో అక్రమాలకు పాల్పడే అవకాశం ఉందని, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ఎస్పీ కార్యకర్తలకు ఇది పరీక్షా సమయం వంటిదని పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ అఖిలేష్ పేర్కొన్నారు. సమయం వృథా చేయకుండా తమ ప్రాంతాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు.బీజేపీ అప్రజాస్వామిక, అనైతిక చర్యలను అడ్డుకోవాలని పిలుపు ఇచ్చారు. గత ప్రభుత్వాలు చేపట్టిన అభివృద్ధిని యోగి ఆదిత్యానాథ్ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం తమ ఘనతగా చెప్పుకుంటోందని దుయ్యబట్టారు. ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్న బీజేపీకి బుద్ధిచెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎస్పీ ప్రతినిధి అనురాగ్ భదౌరియా అన్నారు. యూపీలో ఇటీవల జరిగిన జిల్లా పంచాయతీ ఎన్నికల్లో బీజేపీ అధికార దుర్వినియోగానికి పాల్పడిందని ఆయన దుయ్యబట్టారు.

# విద్యా, వైద్యరంగాలకు ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యం : సబితాఇంద్రారెడ్డి



కొండాపూర్, సెప్టెంబర్ 17:: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యా, వైద్యానికి ప్రథమ ప్రాధాన్యతనిస్తుందని రాష్ట్ర విద్యా శాఖా మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం ఆమె శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని కొండాపూర్ డివిజన్ రాయదుర్గంలో గల ప్రభుత్వ లెదర్ టెక్నాలజీ ఇనిస్టిట్యూట్‌లో రూ.3 కోట్లతో నిర్మించిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల బాలుర హాస్టల్‌ను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, ఎమ్మెల్సీ సురభి వాణిదేవి, టెక్నాలజీ ఎడ్యుకేషన్ కమిషనర్ నవీన్ మిట్టల్‌లతో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంలో విద్యా, వైద్యాలకు ప్రథమ ప్రాధాన్యతనిస్తున్నారని, తెలంగాణ విద్యార్థులు ప్రపంచంతో పోటీ పడేలా తయారు కావాలన్నదే ఆయన ఆకాంక్ష అన్నారు. ప్రస్తుత తరుణంలో వృత్తివిద్యా కోర్సులకు మంచి ఆదరణ ఉందని, ఆసక్తిగల కోర్సులను నేర్చుకుని ఉన్నతశిఖరాలు అధిరోహించాలన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ నాటి నుంచి రూ. 127.33 కోట్లతో 17 పాలిటెక్నిక్ కళాశాలల భవనాలను నిర్మించినట్లు తెలిపారు. 12 నూతన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను నెలకొల్పడం జరిగిందని, ఇందులో 4 కళాశాలలను ప్రత్యేకంగా బాలికల కోసం, 1 ఎస్టీ బాలురకు కేటాయించడం జరిగిందన్నారు. పాలనా వ్యవహారాల్లో పారదర్శకతను పాటించేందుకు, త్వరితగతిన పనులను నిర్వహించేందుకు వీలుగా ప్రభుత్వ సాంకేతిక శాఖ కార్యాలయాలకు, పాలిటెక్నిక్ కళాశాలలను అనుసంధానం చేసినట్లు తెలిపారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్ల జీతాలను రూ. 40,270 నుంచి రూ. 50,850లకు పెంచినట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల నైపుణ్యాన్ని, పరిజ్ఞానాన్ని పెంచేందుకు 1873 ల్యాప్‌టాప్ కంప్యూటర్లను అందించడం జరిగిందన్నారు. రాష్ట్రంలో ఉన్న 22 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో దాదాపు 2200 మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు చదువుతున్నారని, వారికోసం ప్రత్యేకంగా 22 హాస్టళ్లను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించుకున్నట్లు తెలిపారు. వీటి నిర్మాణానికి ఒక్కో హాస్టల్‌కు రూ. 3 కోట్ల చొప్పున రూ. 66 కోట్ల నిధులను కేటాయించినట్లు, ఇందులో భాగంగానే రాయదుర్గంలో నిర్మించిన నూతన హాస్టల్‌ను ప్రారంభించినట్లు తెలిపారు.

రాయదుర్గంలో వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు దాతలు ముందుకు వచ్చి విరాళం ఇవ్వడం అభినందనీయమన్నారు. కళాశాలలో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు అభివృద్ధిలో భాగస్వాములవ్వాలన్నారు. విద్యనభ్యసిస్తూ వస్తువులను తయారు చేసి మార్కెట్‌కు అందించే స్థాయికి ఎదగాలన్నారు. లెదర్ ఫ్యాషన్ టెక్నాలజీ, లెదర్ గూడ్స్?, ఫుట్‌వేర్ టెక్నాలజీలకు మంచి డిమాండ్ ఉందన్నారు. అసంపూర్తిగా మిగిలిన స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే గాంధీ రూ. 10 లక్షలు, ఎమ్మెల్సీ వాణిదేవి రూ. 10 లక్షలు కేటాయించనున్నట్లు ప్రకటించారు. అనంతరం ఇనిస్టిట్యూట్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో లెదర్ ఇనిస్టిట్యూట్ సిబ్బంది, శేరిలింగంపల్లి తాసీల్దార్ వంశీమోహన్, ఆర్ఐ చంద్రారెడ్డి, మాజీ కార్పొరేటర్ రవిందర్ ముదిరాజ్, నాయకులు శ్రీనివాస్ యాదవ్, చాంద్‌పాషా, రామేశ్వరమ్మరెడ్డి, రవిశంకర్ నాయక్, రమేష్, ఊట్ల క్రిష్ణ, వెంకట్‌రెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# నిర్వాసితులకు పరిహారం అందిస్తాం : చొప్పదండి ఎమ్మెల్యే రవిశంకర్

గంగాధర, సెప్టెంబర్ 17:: నారాయణ పూర్ రిజర్వాయర్ పరిధిలోని గ్రామాల ప్రజలు అభద్రతకు గురికావొద్దని, వారికి అండగా ఉంటామని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని నారాయణపూర్ రిజర్వాయర్‌ను పరిశీలించి, రిజర్వాయర్ కట్ట ఎత్తును పెంచి ఆధునీకరించేందుకు కృషి చేస్తానన్నారు. మధురానగర్ వద్ద నారాయణపూర్ రిజర్వాయర్ కుడి కాలువను పరిశీలించారు.

సోమవారం నుంచి పనులను ప్రారంభిస్తామని అధికారులు ఎమ్మెల్యేకు తెలుపగా పనులు త్వరగా జరిగేలా చూడాలని సూచించారు. రిజర్వాయర్ పరిధిలోని నారాయణపూర్, చెర్లపలి (ఎన్), మంగపేట కింద ముంపునకు గురవుతున్న నిర్వాసితులకు పరిహారం అందేలా చూస్తానని హామీఇచ్చారు. కుడికాలువపై మధురానగర్ వద్ద జగిత్యాల రోడ్డులో బాక్స్??టైప్ కల్వర్టు, వేములవాడ రోడ్డులో బ్రిడ్జి నిర్మిస్తామన్నారు. మల్యాల మండలం పోతారం ఎడమ కాలువ నిర్మాణ పనులను కాంట్రాక్టర్ మధ్యలోనే వదిలేసి వెళ్లడంతో నూతనంగా టెండర్లు పిలిచి తిరిగి పనులను ప్రారంభించాలని అధికారులకు ఆయన సూచించారు. అనంతరం గంగాధర మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఇరిగేషన్ శాఖ సీఈ సుధాకర్‌రెడ్డి, ఎస్ఈ అశోక్, ఈఈలు శ్రీనివాస్‌గుప్తా, సంత్‌ప్రకాశ్, డీఈ అలీమ్, గంగాధర సింగిల్ విండో అధ్యక్షుడు దూలం బాలగౌడ్, కొండగట్టు దేవస్థానం డైరెక్టర్ పుల్కం నర్సయ్య, సర్పంచ్‌లు నవీన్‌రావు, మడ్లపెల్లి గంగాధర్, యండీ నజీర్, జోగు లక్ష్మీరాజం, నాయకులు తోట మహిపాల్, మ్యాక వినోద్ ఉన్నారు.

# గణేష్ నిమజ్జన వేడుకలు ప్రశాంతంగాజరుపుకోవాలి

**జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే**

**-మండపాల నిర్వాహకులు పోలీసుల సూచనలు పాటిస్తూ సహకరించాలి**

**-డి.జె.లకు అనుమతి లేదు, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు**



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 17: (నేటినిజం ప్రతినిధి): గణేష్ నిమజ్జన శోభా యాత్ర,,నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో ఎక్కడా ఎలాంటి. ఇబ్బంది తలెత్తకుండా పోలీసుల సూచనలు పాటిస్తూ జరపాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు. శుక్రవారం వేములవాడ పట్టణంలోని హరి హర ఫంక్షన్ హాల్ లో గణేష్ ఉత్సవ సమితి, మండపాల నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిమజ్జన శోభా యాత్ర ప్రశాంతంగా జరిగే విధంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. శోభాయాత్రను ఎప్పటికప్పుడు పర్యవేక్షించే విధంగా చర్యలు తీసుకున్నామని తెలిపారు. నిమజ్జనం చేసే ప్రధాన ప్రాంతామైన గుడి చెరువు వద్ద పోలీస్ శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేసిందని, ఫ్లడ్ లైట్లు పోలీస్ పికెట్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. గణేష్ నిమజ్జన శోభాయాత్ర జిల్లాలో ప్రశాంతంగా శాంతియుత వాతావరణంలో జరిగే విధంగా అన్ని చర్యలు తీసుకున్నామని, అయితే గణేష్ మండపాల నిర్వాహకులంతా మంచి కండిషన్ లో ఉన్న వాహనాలను మాత్రమే శోభాయాత్రకు వినియోగించాలని సూచించారు. ఆధ్యాత్మిక వాతావరణం చక్కగా కనిపించే విధంగా చూడాలని, మద్యం సేవించి శోభాయాత్రలో పాల్గొనవద్దని సూచించారు. ఊరేగింపులో మద్యం సేవించి పాల్గొనరాదు అని అన్నారు. నిర్వాహకులు చిన్నారులను నిమజ్జన ప్రాంతాలకు తీసుకురావద్దని, నిర్దేశించిన విదంగా క్రమపద్ధతిలో శోభాయాత్రలో పాల్గొనాలని పోలీస్ శాఖ సూచనలు పాటించాలని కోరారు. శోభా యాత్రలో డిజెలకు అనుమతి లేదని, శోభా యాత్రలో రాత్రి 10 గంటల తరువాత ఎవరూ కుడా లౌడ్ స్పీకర్లు వాడినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ముఖ్యంగా శోభాయాత్ర రాత్రి 11 గంటలలోపు ముగించుకోవలని అన్నారు. శోభ యాత్రసమయంలో విద్యుత్ తీగలు విగ్రహాలకు తగలకుండా చూసుకోవాలని, ఇనుప విద్యుత్ స్థంబాలు ఉన్న చోట జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు. నిమజ్జన శోభాయాత్ర ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా మండపాల నిర్వహకులంతా పోలీసుల సూచనలు పాటించాలని అన్నారు. ఈ సమావేశంలో వేములవాడ డిఎస్పీ చంద్రకాంత్ సి.ఐ లు వెంకటేష్ ,బన్సీలాల్ ,మున్సిపల్ కమిషినర్ శ్యామ్ సుందర్ రావు విద్యుత్ శాఖ మరియు ఫైర్ శాఖ అధికారులుఎస్ ఐ లు శేఖర్,రామచంద్రం మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

# పచ్చదనంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం : మంత్రి శ్రీనివాస్ గౌడ్



మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 17:కోదాడ నుంచి బళ్లారి వరకు వయా జడ్చర్ల మహబూబ్ నగర్ మీదుగా ఉన్న జాతీయ రహదారి వెంట ఒక క్రమ పద్ధతిలో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ప్రస్తుతం హైదరాబాద్ నుంచి బెంగళూరు హైవేపై ఉన్న విధంగా జడ్చర్ల -మహబూబ్ నగర్ హైవే పైన పచ్చదనం పెంచాలని ఆయన అధికారులకు సూచించారు. మహబూబ్ నగర్ పట్టణ శివారులోని అప్పన్నపల్లి వద్ద జాతీయ రహదారి వెంట నాటిన మొక్కలను ఆయన పరిశీలించారు. ప్రస్తుతం నాటిన మొక్కలను సంరక్షించడంతో పాటు ఎక్కడైనా మొక్కలు చనిపోతే వెంటనే వాటి స్థానంలో వెంటనే మొక్కలను నాటాలని సూచించారు. మహబూబ్ నగర్ పట్టణంలోకి ప్రవేశించే వారికి ఆకుపచ్చని పాలమూరు స్వాగతం పలకాలని ఆయన కోరారు.

దేశంలోనే అతి పెద్దదైన కేసీఆర్ అర్బన్ ఎకో పార్కులో మరిన్ని విభిన్నమైన మొక్కలను నాటి పచ్చదనాన్ని మరింతగా పెంచాలని అధికారులకు సూచించారు. బైపాస్ రోడ్డు వెంట నాటిన మొక్కల్లో అక్కడక్కడ కొన్ని చనిపోయాయని వెంటనే అక్కడ కొత్తగా మొక్కలను నాటి రక్షించాలని అధికారులను ఆదేశించారు. రహదారుల వెంట మొక్కలను నాటి వాటిని సంరక్షించే అంశంలో అధికారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మంత్రి వెంట మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్, మున్సిపల్ కమిషనర్ ప్రదీప్, ఇతర అధికారులు ప్రజా ప్రతినిధులు ఉన్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించిన స్పీకర్ పోచారం

నిజామాబాద్, సెప్టెంబర్ 17: ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన అయిదుగురు ఉపాధ్యాయులను శుక్రవారం బాన్సువాడ పట్టణంలోని తన నివాసంలో శాసనసభాపతి పోచారం శ్రీనివాస్ రెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా స్పీకర్ పోచారం మాట్లాడుతూ..ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన గురువులకు శుభాకాంక్షలు తెలిపారు.

నేడు విద్య లేక పోతే విలువ లేదు. ఆ విలువను అందిస్తున్న ఉపాధ్యాయులు గొప్పవారన్నారు. బాన్సువాడ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలలో రూ. 17 కోట్లతో 170 అదనపు తరగతి గదుల నిర్మాణానికి నిధులను మంజూరు చేశామన్నారు.

రూ. 9 కోట్లతో 100 అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి నిధులను మంజూరు చేసినట్లు తెలిపారు. మలిక వసతులు కల్పించడం ప్రభుత్వాల బాధ్యత. వాటిని ఉపయోగించి విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దడం ఉపాధ్యాయుల బాధ్యత అని సూచించారు. విద్యార్థులు ఉన్నతులుగ తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు.

# వ్యాక్సిన్ కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్





రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 17: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని కొవిడ్-19 వ్యాక్సిన్ కేంద్రాలు ఎన్జీవో భవన్, ఉప్పుగూడ, వైశ్య సత్రం ,సుభాష్ నగర్ ,విద్యా నగర్, గాంధీనగర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పాత భవనం ,మార్కండేయ నగర్ లోని కరోనావ్యాక్సిన్ కేంద్రాలను శుక్రవారం జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 13 నుండి జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున కోవిడ్శ్రీ-19వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. 18 సంవత్సరాల వయసు పైబడి అర్హత కలిగిన వ్యాక్సినేషన్ తీసుకోని ప్రతి ఒక్కరూ జిల్లాలోని జిల్లా ప్రధాన ఆస్పత్రి, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రము, ఏరియా ఆస్పత్రి మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని గ్రామాలలో నిర్వహించే వ్యాక్సినేషన్ కేంద్రాలకు వెళ్లి తప్పక వ్యాక్సినేషన్ చేసుకోవాలని కోరారు. కోవిడ్ -19 నివారణకు వ్యాక్సినేషన్ తీసుకోవడం చాలా ముఖ్యం అని , దీనివల్ల సమాజంలో వ్యాధిని నివారించడం సులభం అవుతుంది. దీనిపై క్షేత్ర స్థాయిలో సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించి సందేహాలు తీర్చాలిని,వ్యాక్సిన్ పై ప్రజలు ఎలాంటి అపోహాలు పెట్టుకోవద్దని, ఇది సురక్షితమైనది అని అన్నారు. దీని నివారణకు ప్రజలు ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా గుర్తించి కరోనా రహిత సమాజం నిర్మాణానికి సహకరించాలి అన్నారు. జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డా. ఎ. సుమన్ మోహన్ రావు మాట్లాడుతూ గత 4 రోజులలో సోమవారం నుండి గురువారం వరకు జిల్లాలో కొనసాగుతున్న ప్రత్యేక డ్రైవ్ లో 41,759 మందికి కోవిడ్-19 వ్యాక్సిన్ వేయడం జరిగిందని, ఈ కార్యక్రమం విజయవంతం చేయడానికి తమ సిబ్బందికి ప్రజాప్రతినిధులు, పంచాయతీ రాజ్,మున్సిపల్,రెవెన్యూ, ఐసిడియస్ ,డి ఆర్ డి ఎ,వివిధ శాఖల అధికారుల సమన్వయం తో ప్రణాళిక బద్ధంగా కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని అందరి సహకారంతో నిర్ణీత లక్ష్యాన్ని విజయవంతంగా పూర్తి చేస్తామని అన్నారు.

# స్కిల్ ఇండియా మిషన్ అమలులో భారతీయ రైల్వేల ప్రయాణం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17:రైల్వేలలో ప్రాథమిక స్థాయి శిక్షణను అందించి యువతకి సాధికారత కల్పించాలన్న లక్ష్యంతో ఆజాది కా అమృత్ మహోత్సవ్లో భాగంగా దేశవ్యాప్తంగా రైల్వే శిక్షణా సంస్థల ద్వారా అందించనున్న శిక్షణా కార్యక్రమాలను కేంద్ర రైల్వే, కమ్యూనికేషన్స్, ఎలక్ట్రానిక్స్ మరియు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రి శ్రీ కౌశల్ వికాస్ ప్రారంభించారు. ఢిల్లీ రైల్ భవన్ లో మంత్రి ఈ రోజు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన (పీఎంకేవీవై) లో భాగంగా అమలు కానున్న రైల్ కౌశల్ వికాస్ యోజన(ఆర్కేవీవై) ను అమలు చేస్తారు. ప్రారంభ కార్యక్రమంలో రైల్వే బోర్డు చైర్మన్ మరియు సీఈఓ శ్రీ సునీత్ శర్మ మరియు రైల్వే ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

దేశంలో విశ్వకర్మ జయంతి రోజున శిక్షణా కార్యక్రమాలను ప్రారంభించడం పట్ల మంత్రి హర్షం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ కి జన్మ దిన కానుకగా ఈ శిక్షణా కార్యక్రమాలను అందిస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. నైపుణ్యాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నదని అన్నారు. రైల్ కౌశల్ వికాస్ యోజన కింద 50 వేల మంది యువతకు శిక్షణ ఇస్తామని తెలిపారు. వివిధ రంగాల్లో యువత నైపుణ్యాలను మెరుగు పరచాలన్న లక్ష్యంతో రైల్ కౌశల్ వికాస్ యోజనకు రూపకల్పన చేశామని మంత్రి వివరించారు. రైల్ కౌశల్ వికాస్ యోజన కింద మారుమూల ప్రాంతాలలో కూడా శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తామని అన్నారు. రైల్ కౌశల్ వికాస్ యోజన శిక్షణా కార్యక్రమాల ద్వారా నైపుణ్యాలను మెరుగు పరుచుకోవాలని ఆయన కోరారు.

రైల్ కౌశల్ వికాస్ యోజన కింద మూడు సంవత్సరాల కాలంలో 50000 మంది అభ్యర్థులకు శిక్షణ అందిస్తారు. తొలుత 1000 మంది అభ్యర్థులకు నాలుగు ట్రేడ్‌లలో అవసరమైన శిక్షణ అందిస్తారు. ఎలక్ట్రీషియన్, వెల్డర్, మెషినిస్ట్ మరియు ఫిట్టర్ తరగతుల్లో 100 గంటల ప్రాథమిక ప్రాథమిక శిక్షణ ఉంటుంది. ప్రాంతీయ డిమాండ్‌లు అవసరాలకు అనుగుణంగా జోనల్ రైల్వే, ఉత్పత్తి యూనిట్లు ఇతర ట్రేడ్‌లలో శిక్షణా కార్యక్రమాలను అందిస్తాయి. శిక్షణ ఉచితంగా అందించబడుతుంది. మెట్రిక్యులేషన్‌లో మార్కుల ఆధారంగా పారదర్శక విధానంలో ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తుల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. 10 వ తరగతి ఉత్తీర్ణులై 18-35 సంవత్సరాల మధ్య ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. అయితే ఈ శిక్షణ ఆధారంగా రైల్వేలో ఉద్యోగం పొందడానికి ఎలాంటి క్లెయిమ్ ఉండదు.

శిక్షణా పాఠ్యాంశాలను బనారస్ లోకోమోటివ్ వర్క్స్ అభివృద్ధి చేసింది. కార్యక్రమాన్ని అమలు చేసే బనారస్ లోకోమోటివ్ వర్క్స్ అంచనాలను ప్రామాణీకరించి పాల్గొనేవారి కేంద్రీకృత డేటాబేస్‌ను కూడా నిర్వహిస్తుంది. తొలుత 1000 మందికి ఈ పథకం కింద శిక్షణ ఇస్తారు. అప్రెంటీస్ చట్టం 1961 ప్రకారం అప్రెంటీస్‌కి అందించే శిక్షణ కంటే ఎక్కువ ఉంటుంది. అందించే కార్యక్రమాలు , ధరఖాస్తులు ఆహ్వానిస్తూ జారీ అయ్యే నోటిఫికేషన్ , ఎంపికైన అభ్యర్థుల జాబితా, స్టడీ మెటీరియల్ మరియు ఇతర వివరాలను అందించడానికి వెబ్‌సైట్ ను అభివృద్ధి చేస్తున్నారు. ప్రస్తుతం, దరఖాస్తుదారులు ప్రారంభ దశలో స్థానికంగా జారీ చేసిన ప్రకటనలకు ప్రతిస్పందనగా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్లో దరఖాస్తులను స్వీకరించడానికి త్వరలో కేంద్రీకృత వెబ్‌సైట్‌లో తెరవబడుతుంది. ప్రామాణికమైన మదింపు ముగిసిన తర్వాత శిక్షణ పొందినవారికి నేషనల్ రైల్ ట్రాన్స్‌పోర్టేషన్ ఇన్స్టిట్యూట్ ద్వారా కేటాయించిన ట్రేడ్‌లో సర్టిఫికేట్ ఇవ్వబడుతుంది. వారికి కూడా వారి ట్రేడ్‌కు సంబంధించిన టూల్‌కిట్‌లు అందించబడతాయి. శిక్షణను సద్వినియోగం చేసుకోవడానికి స్వయం ఉపాధి కోసం సామర్థ్యాన్ని పెంచడంతోపాటు వివిధ పరిశ్రమల్లో ఉపాధిని పెంపొందించడానికి సహాయపడుతుంది. దేశవ్యాప్తంగా ఉన్న 75 రైల్వే శిక్షణా సంస్థలను దేశవ్యాప్తంగా యువతకు ట్రేడ్‌లలో శిక్షణ ఇవ్వడానికి ఎంపిక చేయడం జరిగింది. ఈ పథకం యువత ఉపాధి సామర్థ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా స్వయం ఉపాధి పొందుతున్న వారికి, మరియు కాంట్రాక్టర్ల వద్ద పని చేస్తున్న వారి నైపుణ్యాలను మెరుగుపరుస్తుంది. నైపుణ్య భారత్ సాధనకు ఇది సహకరిస్తుంది.

# 'ఆజాది కా అమృత్ మహోత్సవం' నిర్వహణలో భాగంగా ఇంజినీర్సడే వేడుకల్లో టెక్ క్వెస్ట్ క్విజ్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17:'ఆజాది కా అమృత్ మహోత్సవం' జరుపుకుంటుండడం, ప్రముఖ ఇంజినీర్ డాక్టర్ ఎం విశ్వేశ్వరయ్య 162 వ జన్మదినాన్ని పురస్కరించుకుని, సెయిల్-భిలాయ్ స్టీల్ ప్లాంట్ మానవ వనరుల అభివృద్ధి (హెచ్ఆర్‌డీ) విభాగం ద్వారా హెచ్ఆర్‌డీసీలో 'టెక్‌బిక్వెస్ట్ 1.0' అనే ప్రత్యేకమైన క్విజ్ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ఆడియో- విజువల్ క్విజ్, టెక్నాలజీ మరియు ఇంజనీరింగ్ విషయాలకు అంకితం చేయబడింది, రాత అర్హత రౌండ్‌లో 30 ఇద్దరు సభ్యుల జట్లు పాల్గొన్నాయి, అందులో ఆరు జట్లు ఫైనల్‌కు చేరాయి. ఈ క్విజ్ టెక్నాలజీ మరియు ఇంజినీరింగ్‌పై ఆసక్తికరమైన రీతిలో తగు జ్ఞానాన్ని పంచుకోవడానికి అటువంటి కార్యక్రమం నిర్వహిస్తే మేలని ఈడీ (పీ అండ్ ఏ) శ్రీ ఎస్.కె. దూబే వ్యక్తం చేసిన ఆలోచనకు వాస్తవరూపకతగా ఈ క్విజ్ నిర్వహించడం జరిగింది.

## గణేష్ డి వద్ద ఘనంగా గోమాత పూజా

# పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులు



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 17: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని అంజనీనగర్ లో వినాయక మండపం వద్ద గురువారం రాత్రి 24 వార్డు కౌన్సిలర్ అన్నారం ఉమా రాణి శ్రీనివాస్ ఆధ్వర్యంలో గోమాత పూజా కార్యక్రమం జరిగింది .పెద్ద ఎత్తున భక్తులు పాల్గొనే గోమాతను పూజించారు ఈకార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు ప్రతాప రామకృష్ణ ,ఉత్సవ కమిటీ సభ్యులు,వార్డు మహిళలు ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రోస్టేట్ పెరగడం వల్ల మూత్ర విసర్జనలో సమస్యలు రావొచ్చు !



హైదరాబాద్ , సెప్టెంబర్ 17:ప్రోస్టేట్ పెరగడాన్ని వైద్యపరంగా బీపీహెచ్ లేదా బెనిగన్ ప్రోస్టేటిక్ హైపర్‌ప్లాసియాగా వ్యవహరిస్తుంటారు. వయసు మీద పడిన వారిలో హార్మోన్ల మార్పుల కారణంగా అతి సాధారణంగా కనిపించే సమస్య ఇది. నిరపాయమైనది బీపీహెచ్. అంటే ఇది క్యాన్సర్ కాదు. అలాగే ఇది క్యాన్సర్ కారకం కూడా కాదు. అయితే బీపీహెచ్, క్యాన్సర్ ఒకే సారి ఏర్పడే అవకాశాలు కూడా ఉన్నాయి. వ్యక్తులను బట్టి బీపీహెచ్ లక్షణాలు కూడా మారుతుంటాయి. ప్రోస్టేట్ పెరగడం వల్ల కలిగే అసౌకర్యం, సమస్యలు దీర్ఘకాలంలో అధికమయ్యే అవకాశాలున్నాయి. బీపీహెచ్ వృద్ధి చెందడానికి ప్రధానంగా వయసు, కుటుంబ చరిత్ర, వైద్య పరమైన కారణాలు అంటే ఊబకాయం వంటివి కారణం కావొచ్చు. వయసుతో పాటుగా ప్రోస్టేట్ ప్రధానంగా రెండు దశలను చూస్తుంది. మొదటిది యుక్తవయసులో కనిపిస్తుంది. ఈ వయసులో ప్రోస్టేట్ రెట్టింపు పరిమాణంలో ఉంటుంది. రెండవ దశలో ఈ వృద్ధి అనేది 25 ఏళ్ల వయసులో ప్రారంభమై జీవితాంతం ఉంటుంది.

బీపీహెచ్ సాధారణంగా ఈ రెండవ దశలోనే వృద్ధి చెందుతుంది. ప్రోస్టేట్ పెరిగితే, మూత్రాశయంలో అవరోధాలు ఏర్పడి, తరచుగా మూత్రం పోయాల్సి రావడం, మూత్రం సరిగా రాకపోవడం, మూత్రం పలుమార్లు ఆపి ఆపి పోయాల్సి రావడం తదితర సమస్యలు రావొచ్చు. డాక్టర్ సీ రవీందర్ రెడ్డి, కన్సల్టెంట్ యురాలజిస్ట్, ఈఎస్ఐ హాస్పిటల్ మాట్లాడుతూ "ఆశ్చర్యకరంగా ఇది అత్యంత సహజమైన పరిస్థితి. 50?60 సంవత్సరాలు దాటిన సగం మందికి పైగా పురుషులలో ఈ స్థితి కనిపిస్తుంది. 80 ఏళ్లు వచ్చేసరికి 90% మంది పురుషులకు బీపీహెచ్ వస్తుంది. చాలామంది ఇది వయసుతో పాటుగా వచ్చే సమస్యగానే భావించి నిర్లక్ష్యం చేస్తుంటారు. అయితే తరచుగా వాష్‌రూమ్‌కు వెళ్లాల్సి రావడమనే సమస్య అకస్మాత్తుగా పెరిగినప్పుడే దానిని సమస్యగా పరిగణిస్తుంటారు" అని అన్నారు. డాక్టర్ సీ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ బీపీహెచ్, ప్రోస్టేట్ క్యాన్సర్‌కు ఎలాంటి సంబంధం లేదు. కానీ దీనికి మూల కారణాలను మాత్రం మీ డాక్టర్ తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు.

మీకు కనిపిస్తున్న లక్షణాలు స్వల్ప, మోస్తరు, తీవ్రమైనా సరే డాక్టరును సంప్రదించి, మీకు తగిన చికిత్సావకాశాలను పొందాల్సి ఉంది. బీపీహెచ్ నిర్వహించడానికి అతి సులభమైన జీవనశైలి మార్పులను చేసుకుంటే సరిపోతుంది. చురుగ్గా ఉండటం, బాత్‌రూమ్‌కు వెళ్లినప్పుడల్లా మూత్రాశయం ఖాళీ చేసుకునే ప్రయత్నం చేయడం, మీకు మూత్రం వస్తున్నా, రాకున్నా ప్రతి రోజూ నిర్దిష్ట సమయాలలో మూత్రం పోసేందుకు ప్రయత్నించడం, మద్య పానాన్ని పరిమితం చేసుకోవడం, రాత్రి 8 గంటల తరువాత ద్రవాహారం తీసుకోవడం మానివేయడం వంటివి చేస్తే సమస్యను కొంత మేర పరిష్కరించుకోవచ్చు. తీవ్రమైన కేసులలో ప్రోస్టేట్ పెరగడం వల్ల మూత్రం రాకుండా ఆగిపోవచ్చు. దీనివల్ల మూత్రపిండాలు విఫలం కావొచ్చు. దీనికి తక్షణమే చికిత్స చేయాల్సి ఉంటుంది. కనుక లక్షణాలు కనబడితే తక్షణమే నిర్ధారణ పరీక్షలు చేయించుకుని, తగిన చికిత్స పొందడం ద్వారా ఉపశమనం పొందవచ్చు.

# ఎన్ఎస్ఐసీ సీఎండీగా బాధ్యతలు స్వీకరించిన ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ జేఎస్ శ్రీమతి అల్కా నంగియా అరోరా

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17:'నేషనల్ స్మాల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ లిమిటెడ్' (ఎన్ఎస్ఐసీ) చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా (సీఎండీ) ఐడీఏఎస్‌కు (91) చెందిన శ్రీమతి అల్కా నంగియా అరోరా 14సెప్టెంబర్, 2021న అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె ఎన్ఎస్ఐసీ సీనియర్ అధికారులతో సమావేశమయ్యారు.

2021-22 మధ్య కాలంలో తమతమ వృత్తులలో అత్యుత్తమమైన పని తీరును కొనసాగిం చాలంటూ ఆమె ఉద్యోగులను ప్రోత్సహిం చారు. శ్రీమతి అల్కా అరోరా దేశ వ్యాప్తంగా విభిన్నమైన కార్యకలాపాలలో 30 సంవత్సరాల అనుభవం కలిగిన పరిశ్రమ అనుభవజ్ఞురాలు.

ప్రస్తుతం శ్రీమతి అల్కా అరోరా కేంద్ర సూక్ష్మ, చిన్న ఉ మధ్యతర హా పరిశ్రమల మంత్రిత్వ శాఖలో జాయింట్ సెక్రటరీగా సేవలందిస్తున్నారు. హస్త కళలు, టెక్స్‌టైల్స్ మంత్రిత్వ శాఖ, మేనేజింగ్ డైరెక్టర్, కాటేజ్ ఎంపోరియం అదనపు కమిషనర్‌గా కూడా పని చేశారు. వెస్ట్రన్ ఎయిర్ కమాండ్ (సుబ్రోతో పార్క్) ఉ ఎఫ్ఏ ఆర్మీ హాస్పిటల్ (ఆర్ ఉ ఆర్) ఇంటిగ్రేటెడ్ ఫైనాన్షియల్ అడ్వైజర్‌గా కూడా పని చేశారు. శ్రీమతి అల్కా అరోరా నేవీలో వివిధ హోదాలలో పని చేశారు. నావల్ డాక్‌యార్డ్ ఫైనాన్షియల్ అడ్వైజర్‌గాను, ముంబయి జాయింట్ కంట్రోలర్ డిఫెన్స్ అకౌంట్స్‌గాను, కమాండ్ ఆర్మీ కోల్‌కతాకు ఎఫ్ఏగాను వివిధ హోదాల్లో పని చేశారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.